# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 43 సంచిక: 07

POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
నవంబరు 2025
వెల – ₹10.00



# ఈ నెల పండుగలు

నవంబరు 05 - కార్తీక పూర్ణిమ

నవంబరు 06 - శ్రీ నాంపల్లి బాబా ఆరాధన





'శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము', గుమ్మళంపాడులో అక్టోబరు 1వ తేదీ బుధవారము నాడు భక్తులందరూ మాతృదేవి జన్మదినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు, గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు యీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిషేకము, విశేష పూజ, సత్సంగాలు, సంకీర్తన సేవ, నృత్యార్చన మొదలైన కార్యక్రమాలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుండే కాక, వేరువేరు ప్రాంతాలనుండి వచ్చిన భక్తులందరూ శ్రద్ధాభక్తులతో యీ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ఎవరినీ శత్రువులుగా తలచకు

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఒకరినుండి ఒకరు వేరు అన్న భావం బలపడడానికి, ఆధునిక జీవితంలో ఒక కుటుంబంతో మరొక కుటుంబానికి ఎట్టి సంబంధాలు లేకుండా బ్రతకడం ఒక పెద్ద కారణం. అలాకాక, భక్తుల కుటుంబాలన్నీ వారానికో, పక్షానికో ఒకచోట సమావేశం కావడం, కలిసి వేడుకలు, పూజాదికాలు చేసుకోవడం దీనికెంతో ఉపకరిస్తుంది. సహజ మానవ ప్రవృత్తిని అనుసరించి కీచులాటలు, పోటీలు, భేదాలు వస్తే రావచ్చు. అందుకు కారణం అంతస్తులు, కుల మత భేదాలు, ఆడంబరాలు అనే దౌర్భాగ్యపు అడ్డుగోడలు హృదయాలను సంకుచితం చేయడమే. కలవారినే గౌరవించడం, లేనివారిని చిన్న చూపు చూడడం వంటి హీన వికార చేష్టలను నేటి సమాజం నూరిపోస్తోంది. వాటిలో చిక్కిన హృదయాలకు పూజలు, జపాలూ ఏమీ ఉపకరించవు. కారణం వాటి ప్రయోజనం హృదయాలను అట్టి భ్రాంతుల నుండి క్షాళన చేయడమే.

అలా పైన చెప్పినట్లు వేడుకలు చేసుకుంటూ ఒకరిలో ఒకరు సాయిని చూచుకుంటూ, అట్టి వివేకంతో, సహనంతో, ప్రేమతో వుండడం వలన ఒకరి నుండి ఒకరు వేరన్న భావం పలచబడుతుంది. అందరూ ఒకే కుటుంబంగా రూపొంది, తమవారిగా తలచి ఒకరి కష్టసుఖాలొకరు పంచుకొనే ఆత్మీయత రావాలి. ఇలా ఒక పరిమితి దాటి కుటుంబ ప్రేమ ఏర్పడ్డప్పుడు, ఎవరినయినా ప్రేమించే సామర్థ్యము కలిగి తమ బంధువుల పట్ల ప్రత్యేక మమకారము తగ్గుతాయి. అందరిపట్ల సమభావము రావాలి.

కారణం అందరిలో సాయి సమానంగా వున్నారు. అవసరాల వలనా, మమకార బాంధవ్యాల వలనా కాక, సాయిపై గల ప్రేమ కారణంగా వారందరిపైనా ప్రేమ ఏర్పడుతుంది. అప్పుడు అందరిలోని 'నేను' అన్న ప్రజ్ఞమీద మన దృష్టి ఎక్కువ కేంద్రీకృతమై, భేద దృష్టి పలచబడినదని గుర్తు. అలాటి భక్త కుటుంబాలలో ఎవరైనా మనపట్ల భేదభావంతో ప్రవర్తించినా మనం మాత్రం వారు –మనము వేరన్న గత జన్మ సంస్కారాలచేత, దాని వలన ఏర్పడిన ఋణానుబంధం వలన యిప్పుడిలా ప్రవర్తిస్తున్నారనీ, కానీ వారి రూపంలో గూడా ఆ ఒక్క ఆత్మ తత్త్వమే ఉన్నదనీ గుర్తించాలి. ఈ సందర్భంలో సాయి అసూయను జయించడం గురించి, ఎవరైనా మనపై కోపించినా మనమెలా మసలుకోవాలో చెప్పిన సూక్తులను పఠించి, అలా చేసిన వారిని స్మరించి, వారి రూపంలో మనసారా సాయి తత్త్వాన్ని భావించి, మనసులోకి వైరభావాన్ని రానివ్వకుండా చూచుకోవాలి. ప్రకృతి సహజంగా, వెనుకటి అలవాటు వలన ఎప్పుడైనా మనమూ ఆవేశపడి ప్రతిక్రియ చేయడం సంభవిస్తే దానిని గుర్తించి, సాయి ప్రార్థనానంతరం, చరిత్ర పారాయణానంతరం ఆ సంఘటన గురించి పునరాలోచన, ఆత్మవిమర్శ చేసుకోవాలి. మన శ్రేయస్సుకు మనమే ఎలా విఘాతం కలిగించుకున్నామో గుర్తించాలి. వీలయితే అవతలవారితో పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేసుకొని మన పొరపాటును మన్నించమని చెప్పాలి. లేక తొలగియుండాలి గాని, మనస్సులో భేదాన్ని మాత్రం నిలువ నివ్వకూడదు.

**"ఎవరినీ శత్రువులుగా తలచకు" అన్న సాయి వాక్యాన్ని పాటించ యత్నించాలి.●**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 నవంబర్ - 2025 సంచిక:07

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ఎవరినీ శత్రువులుగా తలచకు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | మానవత్వమా?..... దైవత్వమా? | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీ వెంకటరమణ (U.S.A) | 10 |
| 05. | మాతృదేవి జన్మ దినోత్సవ వేడుకలు | శ్రీమతి టి. పద్మావతి | 12 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 18 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 21 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 25 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ ఎస్.వి.సుబ్బయ్య | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ అబ్దుల్ అమీన్ | 28 |



**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271

**www.saibharadwaja.org**



చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- మా వూరిలో ఒక వ్యక్తి బాబా పటమునుంచి, చేతుల నుంచి విభూతి తీస్తున్నారు. మీ వ్యాఖ్యానం ?**

**- చిలకల చంద్రశేఖర్, తెనాలి**



**జవాబు :-** ఆధ్యాత్మికతలో ప్రయోజనకారి కానిదేదైనా అవాంఛనీయమే. అన్నమైనా అరగకుంటే విషతుల్యమౌతుందిగదా! ఇలా విభూతి తీయడం వలన ప్రయోజనం? అది మహిమగలదనడం సమంజసముగాదు. సాయిని స్మరించి మట్టినొసట పెట్టినా రోగాలు తగ్గిన సందర్భాలు చరిత్రలో వున్నాయి. అపుడు ప్రత్యేకించి యిలా విభూతి తీయడంవలన దానికి వచ్చిన పవిత్రత ఏదీలేదు.

అన్నిటికంటే ముఖ్యమయిన విషయం – కుశాభావు అలాచేస్తే సాయి అతనిని దండించి మాన్పించడమేగాక దానిని తీసుకున్నవారు అపవిత్రులు అవుతున్నారని, అది పాపమని చెప్పి ఆ దోష నివారణకోసం 'శ్రీగురుచరిత్ర' అతనిచేత 108 పర్యాయాలు పారాయణ చేయించడమే గాక ఆ విద్యను పరిత్యజించమని నిర్భందించారు. శ్రీసాయిబాబాకు మించిన ప్రమాణమింకొకటి లేదు.

'అలా విభూతి తీసే బదులు బహుమతులు గెల్చే లాటరీ టిక్కెట్లు తీయగల్గుతే మంచిది గదా!' అని జోక్ చేసి ఆ ఛాయలకు వెళ్ళకండి. అలా వచ్చిన విభూతే మహిమ కలదని శాస్త్రంలో ఎక్కడా చెప్పబడలేదు. పిడకలు కాల్చి చేసినదైనా భావయుక్తంగా వాడుకుంటే ప్రయోజనకారియని దైవ గ్రంథాలన్నీ ఘంటాపథంగా చెప్పాయి.

(ఫిబ్రవరి 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)

# మానవత్వమా? ..... దైవత్వమా?

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

మానవ శ్రేయస్సుకు మానవత్వం గొప్పదా? దైవత్వం గొప్పదా?' అనే ప్రశ్న ఎప్పుడూ వుంటూనే వుంటుంది. కొంతమంది మానవత్వమే గొప్పదంటే, కొంతమంది దైవత్వమే గొప్పదని వాదించుకుంటుంటారు. ఇంతకూ ఏది గొప్పది? అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికుండడం సహజమే. కానీ అసలు మానవత్వమంటే ఏమిటి? దైవత్వమంటే ఏమిటి? అనే విషయం గూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారు?

పరిపూర్ణ మానవత్వమే దైవత్వమని పూజ్యశ్రీ మాస్టరుగారు చేప్పేవారు. పరిపూర్ణ మానవత్వమంటే?..... మనిషి మనిషిగా బ్రతకడం. అదేం మాట? మనిషి మనిషిగా బ్రతుకక జంతువుగా బ్రతుకుతున్నాడా ఏమిటి? అసలు జంతువుగా ఎలా బ్రతుకుతాడు? అనే సందేహం కొందరికి రావచ్చు. కానీ ఈనాడు చాలామంది మనుషులు మనుషులుగా బ్రతకడం లేదనడంలో సందేహం లేదు. కారణం 'మనుష్య రూపేణ మృగాః చరంతి" అని భర్తృహరి చెప్పివున్నాడు. అంటే రూపం మనిషిదే కావచ్చు గాని గుణాలు జంతువులవే అని అర్థం. కానీ ఆలోచిస్తే ఇప్పటి కొందరు మనుషులకంటే జంతువులే మేలేమోనని అనిపించక తప్పదు. ఉదాహరణకు కుక్కకు వున్న విశ్వాసం కొంతమంది మనుషులకు వుండదు. అలాగే మరికొన్ని జంతువులకున్న సద్గుణాలు కొంతమంది మనుషులలో లేకపోవచ్చు. అలాగే కొన్ని జంతువులకున్న దుర్గుణాలు కొందరిలో కనిపిస్తాయి. అందుకే మన పెద్దవాళ్ళంటుంటారు, "వీడికి మేలు చేయడం పాముకు పాలు పోసినట్లయింది" అని. అంటే "పాము తనకు ఆహారం పెట్టినవాడినే కాటువేసినట్లు, మనుషులు మేలు చేసినవారికే కీడు తలపెడతారు" అని. ఇలాగే ఎన్నో జంతువుల లక్షణాలు కొంతమంది మనుషులలో కనిపిస్తుంటాయి. అంటే మనిషి రూపంలో మృగాలు సంచరిస్తున్నట్లే కదా!

అలాగే 'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టేవాడు' అని, 'ఏరు దాటగానే తెప్పను తగలేసిన వాడనీ', 'చెప్పుతినెడి కుక్క', 'పులితోలు కప్పుకున్న నక్క' అనీ, 'కోతి బుద్ధి' అనీ, 'కుక్క బుద్ధి' అనీ – ఇలా ఎన్నో రకాలుగా మనుషులు చెడుతనం గూర్చి చెప్పుకుంటుంటారు. అలాగే మనుషుల మంచితనం గూర్చిగూడ చెబుతుంటారు. 'కుక్కలాగా విశ్వాసంతో పడివుంటాడు' అనీ, 'గాడిదలాగా చాకిరీ చేస్తా' డనీ, కోయిలలాగా మధురస్వరం కలవా' డనీ!

కాకిలాగా గోల చేస్తాడనీ, గార్దభస్వరం అనీ, చెవికోసిన మేకలాగా అరుస్తుంటాడనీ, జిత్తులమారి నక్క అనీ, అజగరం లాగా ఊరికే పడివుంటాడనీ, నోరులేని

జంతువులాగా అనీ – యిలా ఎన్నో ఉపమానాలు. అంటే మానవునికీ, జంతువులకూ గుణాలలో అవినాభావ సంబంధమున్న దన్నమాట. అంతేకాదు. మానవులలో రాక్షసులు గూడా వుంటారనీ నరరూప రాక్షసులనీ, బకాసురుడనీ, కుంభకర్ణుడనీ, కీచకుడనీ ఇలా రాక్షసులతో గూడ పోల్చారు. అయితే ఇంతకూ మానవత్వలక్షణాలేమిటి?

గొడ్డులాగా చాకిరీ చేయడమా? కుక్కలాగా విశ్వాసంతో పడివుండడమా? నోరులేని జంతువులాగా వుండడమా? ఏమిటి? అంటే – మాస్టరుగారు ఒక సందర్భంలో మానవత్వానికి నిర్వచనం ఇలా చెప్పారు : 'పరిపూర్ణ మానవుడు రాముడిలాగా వుంటాడు' అని. అంటే రాముడిలాగా వుండడమంటే ఏమిటి? శ్రీ రాముని లక్షణాలేమిటి?

శ్రీరామునిలోని సుగుణాలు ఎన్నో! అంటే ఆయనే సుగుణాలరాశి. ఆయన అపార కరుణామయుడు. తల్లిదండ్రులపట్ల, భార్యాబిడ్డలపట్ల, సేవకులపట్ల, ప్రజలపట్ల, సకల జీవరాశిపట్ల ఆయన ఎంతో ప్రేమగా వుండేవాడు. శ్రీరాముడు ధర్మస్వరూపుడు. ఆయన సకల ధర్మాలను చక్కగా ఆచరించి చూపాడు. శత్రువుల పట్ల ఆయన క్షమాగుణము, తనకు మేలు చేసినవారి పట్ల కృతజ్ఞత, సేవ చేసేవారిపై కరుణ, శరణు పొందినవారిపై క్షమ, పెద్దలు, ఋషుల పట్ల వినమ్రత, కష్టాలలో సహనము, ఎటువంటి పరిస్థితులలోనూ మొక్కవోని ధర్మనిరతి, యాచకులు, ఆశ్రితుల పట్ల దానగుణము, విపత్కర పరిస్థితులలో అపార ధైర్య సాహసాలు –ఇన్నీ ఆయనలో పరిపూర్ణంగా వున్నాయి.

అందుకే ఆయన పరిపూర్ణమానవుడు. దయ, క్షమ, సహనము, ఔదార్యము, ధైర్యము, సాహసము, ఓదార్పు, కృతజ్ఞత, ధర్మనిరతి, అధర్మంపట్ల కఠినత్వము, సకల జీవులపట్ల ప్రేమ, సహాయము చేయడము – ఇలా ఏవి మానవత్వ లక్షణాలని చెబుతారో అవన్నీ పరిపూర్ణంగా శ్రీరామునిలో వున్నాయి గనుక ఆయన దేవుడు, అవతారపురుషుడు. అంటే పరిపూర్ణ మానవత్వమే దైవత్వమన్నమాట. ఈనాడు ఇలాంటి మానవులు తక్కువ మందే వున్నారని చెప్పవచ్చు. ఈనాడు మానవులలో ఈ దానవత్వ, పశుత్వ లక్షణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మోసాలు, కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఎక్కువైనాయి. ఒకరిని మించి ఒకరు తమ తెలివితేటలతో మోసం చేయాలనే ప్రయత్నిస్తున్నారు. లౌకిక సుఖాలవేటలో జరిగే యీ అన్యాయాలకు అంతులేకుండా వున్నది. వాటిని చూస్తుంటే, వింటుంటే ఇన్ని రకాలుగా గూడ దుశ్చర్యలు చేయవచ్చా! అని ఆశ్చర్యం కలుగక మానదు. దీనినే దానవత్వమనీ, పశుత్వమనీ అంటారు.

అంటే ఈ ప్రపంచంలో మానవులే లేరా? మానవజాతి నశించిందా? అని కొందరికి అనిపించవచ్చు. పూర్తిగా అలా అనుకోవడానికి వీలులేదు. ఈ మానవత్వమున్న వాళ్ళు అక్కడక్కడా మనకు తారసపడుతూనే వున్నారు. వారినే రామునివలె ధర్మాత్ములనీ, లక్ష్మణునివలె సోదరుడనీ, ఆంజనేయునివలె నమ్మిన బంటనీ యిలా అంటూ వుంటారు. అయితే పరిపూర్ణ మానవత్వం గలవారుగూడ ఈ లోకంలో అవతరిస్తూనే వున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా మానవులలోని రాక్షసత్వాన్నీ, పశుత్వాన్ని తొలగించేందుకు, వారిని ధర్మనిరతివైపు నడిపించేందుకు ప్రయత్నిస్తూ వున్నారు. వారినే, అటువంటి మానవులనే మనం అవతారపురుషులనీ, మహాత్ములనీ, అవధూతలనీ, బాబాలు, స్వాములు అని పిలుస్తూ దైవస్వరూపులుగా ఆరాధిస్తూ వుంటాము. అంటే మనలో ఎటువంటి గుణాలు వున్నప్పటికీ వారిలోని సద్గుణాలంటే మనకు ఎంతో యిష్టమన్నమాట. అందుకనే ఏదో ఒక కారణంగా వారి చుట్టూ తిరుగుతూ వుంటాము.

అట్టి పరిపూర్ణ మానవత్వంతో, సద్గుణ సంపత్తితో మనమధ్య అవతరించినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు. మానవదేహధారియై మనమధ్య సంచరిస్తూ, దైవీ సంపదతో విలసిల్లుతూ, పరిపూర్ణ మానవత్వాన్ని తెలియజేయడానికై గృహస్థాశ్రమంలో వుంటూ,

సామాన్య మానవునిలా ప్రవర్తిస్తూ నేటి సమాజంలో గూడ మానవతతో ఎలా వుండవచ్చో తెలియజెప్పడానికి అవతరించారాయన. ఆయన సన్నిహితులకు, స్నేహితులకు, అనుయాయులకు ఆయనలోని సద్గుణాల సంగతి తెలుసు.

లోకంలో ఎందరో ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందినవారు వున్నారు. కానీ వారు కేవలం ఆధ్యాత్మికతకే ప్రాధాన్యతనిస్తూ, నిజమైన ఆధ్యాత్మిక జీవితమే జీవితమనీ, లౌకిక విషయాల పట్ల నిర్లిప్తులై వుండాలనీ సాధ్యమైతే దానిని త్యజించాలనీ గూడ బోధిస్తూ వుంటారు. కొందరు దేనికోసమైనా సరే కేవలం భగవంతుని ఆరాధిస్తే చాలునని చెప్పి మిగతా విషయాలలో ఎలా ప్రవర్తించాలో తెలియజెప్పరు. అందుకని ఆధ్యాత్మికత అంటే కేవలం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే ఉపయోగపడే సాధనమన్నట్లు ప్రజలలో ఎక్కువమంది భావిస్తున్నారు. అందుకని ఎందరు ఆధ్యాత్మిక వేత్తలను సేవించి ఆరాధించినా వారి సమస్యలు తీరడమేగానీ మనశ్శాంతి లభించడం లేదు. మిగతా విషయాలలో అంటే అహంకార, మమకార, అసూయ, ద్వేషాది విషయాలలో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లున్నది' నేటి భక్తులలో చాలామంది పరిస్థితి. మరి దీనికి పరిష్కారమేమిటి? అసలు ఇది నిజమైన అధ్యాత్మికతా? లేక అసలైన మానవత్వమా? మానవత్వం లేని ఆధ్యాత్మికత వుంటుందా? ఆధ్యాత్మికతగాని మానవత్వం సరియైనదా?

ఈ ప్రశ్నలకు సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు: "పరిపూర్ణ మానవత్వమే ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత వేరనీ, లౌకికత వేరనీ అనుకుంటారు. కానీ యీ రెండూ వేరు గాదు. ఇటు ధర్మం ప్రకారం ఖచ్చితంగా జీవిస్తే, అదే ఆధ్యాత్మికతకు దారి తీస్తుంది. అటు ఆధ్యాత్మికతతో జీవిస్తే ధర్మం ఆచరించక తప్పదు. ఉదాహరణకు ఒకడు లౌకిక జీవితాన్ని పరిత్యజించి ఆధ్యాత్మికత కోసమే సన్యసించినప్పటికీ అతడు సన్యాసధర్మాన్ని సక్రమంగా ఆచరిస్తేగానీ అతడు కోరిన ఆధ్యాత్మికత లభించదు. కాబట్టి ఈ రెండింటినీ సక్రమంగా ఆచరిస్తూనే వీటికతీతమైన దానిని పొందవచ్చు. ఈ రెండింటిలో ఏది లోపించినా కుంటినడక తప్పదు. వాడు పరిపూర్ణ మానవుడు ఏనాటికీ కాలేడు".



పూజ్యశ్రీ మాస్టరుగారు జనన మరణాల తత్త్వం గురించి, సృష్టి తత్త్వం గురించి, ఆధ్యాత్మిక తత్త్వం గురించి తీవ్రంగా ఆలోచించి తెలుసుకున్నారు. శ్రీ శిరిడీ సాయినాథుని అనుగ్రహంతో ఆయన ఆధ్యాత్మికానుభూతి పొందారు. అయినప్పటికీ ఆయన లౌకిక విషయాల పట్ల బాధ్యతను

విస్మరించలేదు. మామూలు వ్యక్తులకంటే ఎంతో బాగా లౌకిక వ్యవహారాలను నిర్వర్తించేవారు. చిన్నప్పటినుంచి ఆయన ధైర్యసాహసాలకు పెట్టిన పేరు. ఎక్కడ ఎవరు అన్యాయంగా ప్రవర్తించినా సహించక వారితో న్యాయపోరాటం జరిపేవారు. తమవారిపట్ల, బంధువులపట్ల మాత్రమేగాక ఆయన అందరిపట్ల ఎంతో ప్రేమగా వుండేవారు. ఎవరికి ఎటువంటి సహాయం కావలసి వచ్చినా తమ శాయశక్తులా సహాయం చేసేవారు. తనవలన సహాయం పొంది తరువాత తమను ద్వేషించిన వారిని గూడ ఆయన నిందించక తండ్రివలె వారు బాగుపడాలని పాటుపడేవారు. చివరకు తమతో ఎంతో దుష్టంగా ప్రవర్తించినవారిపట్ల గూడ 'వారేమి చేస్తున్నారో వారికి తెలియదు. తండ్రీ! వారిని క్షమించు' అన్న ఏసుక్రీస్తు వలె వారి పట్ల జాలిపడేవారు. తమ తప్పు తెలుసుకుని తిరిగి ఆశ్రయించినవారిని ఆయన క్షమించేవారు.

ఇక సమాజం బాగుపడాలని ఆయన శతవిధాలా ప్రయత్నించారు. లౌకిక కోరికలతో వచ్చేవారికి బాబాను ఆశ్రయిస్తే వారి కోరికలు తీరుతాయని పారాయణలు చెప్పడమే గాక, శాంతి సౌఖ్యాలతో వుండడానికి అది మాత్రమే చాలదనీ, మనలోని దుర్గుణాలను పోగొట్టుకోవాలని ఆయన బోధించేవారు. వాటిని పోగొట్టుకోవడానికి వివేకంతో ఆలోచించడం ముఖ్యమని చెప్పి ప్రతివిషయంలోను ఎలా ఆలోచించి ఆయా గుణాలను పోగొట్టుకోవచ్చో ఆయన వివరించి చెప్పేవారు. సామాన్యంగా ఇతరులెవరూ చెప్పని ఈ విషయం గూర్చి ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. కారణం రాగద్వేషాదులను, అహంకార మమకారాలను పోగొట్టుకోనిదే ఇటు సామాజిక జీవనం గానీ, అటు ఆధ్యాత్మిక జీవనం గానీ సక్రమంగా వుండడం సాధ్యంగాదని ఆయన నొక్కి వక్కాణించారు. నేడు ఈ స్వార్థ మమకారాదులు, అసూయాదుల వలననే సమాజం ఎంతగా అశాంతికి గురి అవుతున్నదో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇక వీటిని పోగొట్టుకోకుండా ఆధ్యాత్మికతలో ఎంతగా అభివృద్ధి సాంధించినప్పటికీ అది అభివృద్ధి ఏ విధంగానూ కాజాలదనీ, దానివలన రావణాది రాక్షసులవలెనే తమ శక్తులతో, ఆధ్యాత్మికత పేరుతో సమాజాన్ని ఇంకా అశాంతికి గురి చేయడమే అవుతుందనీ, అందువలన సమాజ పతనం తప్పదని ఆయన చెప్పేవారు.

సామాజిక పరంగా గూడ – సమాజం బాగుపడడానికి అనేక సూచనలు అందించారు. విద్యావ్యవస్థను మార్చాలని, ఉపాధి వ్యవస్థను మార్చాలని, దూరదర్శన్, పత్రికలు, సినిమాలు ఇప్పుడున్న వైఖరిని మార్చుకోవాలనీ, అవినీతికి అవకాశమివ్వకూడదనీ, ధర్మప్రబోధం చేయాలనీ చెప్పేవారు. కారణం అవి అన్నింటికంటే శక్తివంతమైన ప్రచార సాధనాలు గనుక వాటిని సరియైన విధంగా ఉపయోగించుకుంటే సమాజం బాగుపడడానికి ఎంతో అవకాశముంటుందని చెప్పేవారు. ప్రతివారూ సాటివారిపట్ల మానవత్వంతో ప్రవర్తించాలని, అందుకు 'సాటివారు మనకేది చేయాలనుకుంటామో అది వారికి చేయాలి' అనే సూత్రాన్ని పాటిస్తే అందరూ సుఖశాంతులతో వుండవచ్చని ఆయన చెప్పేవారు.

ఇవన్నీ వాచా బోధించడము మాత్రమే గాక ఆయన అన్నింటినీ ఉత్తమంగా ఆచరించి చూపారు. సకల జీవులపట్ల ప్రేమ, శాంతము, కరుణ, దయ, క్షమ. మిన్ను విరిగి మీద బడ్డా మొక్కవోని ధైర్యం, సాహసం, అకుంఠిత దీక్ష, విజ్ఞాన సంపద, భక్తి జ్ఞాన వైరాగ్యములు – ఇవన్నీ ఆయన సహజ గుణాలు. మానవత్వము, దైవత్వమూ మూర్తీభవించిన ఆయన పరిపూర్ణ మానవుడుగాక మరేమిటి? అందుకే ఆయన అవతారపురుషుడు.

ఈ ఫిబ్రవరి తొమ్మిది 2011న, ఆయన చెప్పిన వాటిని గుర్తు తెచ్చుకుని ఆచరిస్తూ పరిపూర్ణ మానవత్వాన్ని పొందడానికి ప్రయత్నం చేద్దాము.●

# మాతృదేవి స్మృతులు

**శ్రీ వెంకటరమణ (U.S.A)**

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని అమెరికాలోని మిన్నెసోటా (minnesota)లో వుంటున్న వెంకటరమణగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు–

నేను అమెరికా వచ్చి 2022 నాటికి, 6 సంవత్సరాలు. మాది నెల్లూరు. పామూరులో మా అన్నయ్య సత్సంగాలు నిర్వహిస్తూ వుంటారు. మా అమ్మగారు, తమ్ముడు, ఇంకా మా ఇంట్లో అందరమూ పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలోనే వున్నాము. మేమందరం లక్ష పారాయణ యజ్ఞంలో పాల్గొని గ్రంథాలు పారాయణ చేసేవాళ్ళం. చాలాసార్లు బాబా, తానూ ఒక్కటేనన్న అనుభవాలను పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదించారు.

మాకు పెళ్ళైన పదేళ్లవరకు సంతానం కలగలేదు. ఒకసారి గర్భస్రావం జరిగింది. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, బాబా స్వప్న దర్శనమిచ్చి, లోపల వున్న శిశువుకు ఆరోగ్య సమస్యలు వుండటంవల్ల అలా చేశామని చెప్పారు. తరవాత మా భార్యాభర్తలిద్దరం సంతానం కోసం శ్రీ సాయిలీలామృతం పారాయణ చేశాము. కొంతకాలానికి నా శ్రీమతి గర్భవతి ఆయింది. మా ఇద్దరికీ మనసులో బాబు పుడితే బాగుండునని వుండేది. కానీ, '10 సంవత్సరముల తరవాత భగవంతుడు ఇంతటి అవకాశమిస్తే బాబు, పాప అని కోరుకోవడం సమంజసం కాదనిపించేది. ప్రత్యేకంగా కోరుకోకపోయినా మనసులో ఈ కోరిక వుండేది. ఇక్కడ ఆసుపత్రిలో పుట్టబోయేది ఆడా, మగా అనే నిర్ధారణ దాదాపు 6 వ నెల వచ్చేసరికి చెప్పేస్తారు. ఈలోపల శిశువు గుండె స్పందనను బట్టి కూడా అబ్బాయో, అమ్మాయో తెలుసుకోవచ్చు. ఒకసారి పరీక్షకి వెళ్ళినప్పుడు శిశువు గుండె స్పందన చెప్పిన సంఖ్యని బట్టి, పాప అని అర్థమైంది. సరే, ఏదైనా వారి ప్రసాదమని అనుకున్నాము. అయితే నా శ్రీమతికి పూజ్యశ్రీ అమ్మగారు అద్భుతమైన స్వప్నదర్శనమిచ్చారు. తనకు గర్భంలో పాప వుంటే తీసి బయటపెట్టి, బాబును అందులో పెట్టారట! తరవాత నెల మళ్ళీ పరీక్షకు వెళ్లేసరికి గుండె స్పందన మారిపోయింది! దానిని బట్టి పుట్టబోయేది బాబు అనుకున్నాను. కానీ ఇలా ఎలా మారిందో నాకు అర్థం కాలేదు. మాకు బాబు పుట్టాడు. నా శ్రీమతి ఈ స్వప్నం గురించి బాబు పుట్టిన తర్వాత నాకు చెప్పింది. అప్పుడు శిశువు గుండె స్పందనలో మార్పుకు కారణం నాకు అర్థమైంది!! మామీద పూజ్యశ్రీ అమ్మగారు ఇంతటి అనుగ్రహాన్ని కురిపించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్ల కల్యాణోత్సవమైన మార్చి 6వ తేదీ మా పెళ్లి రోజు కూడా! 2022 మార్చి 6 న ఉదయం 9 గంటలకల్లా ఇంట్లో పూజ పూర్తి చేసుకుని, ఇక్కడ బాబా గుడిలో హోమం జరుగుతుంటే, అందులో పాల్గొనటానికి మా బాబుతో సహా బయలుదేరాము. నేనున్న ప్రాంతంలో కొంచెం మంచు ఎక్కువే పడుతుంది. కారు బయటికి తీసేసరికి బాగా మంచు వుంది కానీ, ఫరవాలేదని బయలుదేరాము. కొంతదూరం వెళ్ళాక ఒక అమ్మాయి తన కారు మలుపు తిప్పుతూ మంచులో జారి మా

కారుకి అడ్డం వచ్చి కారుని కొట్టేసింది. నేనుండే వైపు సగభాగం చితికిపోయింది. చిత్రం ఏమిటంటే, మా కారు పెద్ద శబ్దంతో ఆగిపోయినా, మా ముగ్గురికి కొంచెం కూడా దెబ్బలు తగులలేదు! భయం కూడా కలుగలేదు. కనీసం ఎవరమూ అరవలేదు కూడా! చాలా ధైర్యంగా కూర్చున్నాము. అది మాకే ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయి కారుకి పెద్ద నష్టమేమి కాలేదు. మేము వెంటనే పోలీసులకు ఫోన్ చేసి, జరిగిన విషయం చెప్పి, ఇంటికి వచ్చేసి, పూజ్యశ్రీ మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగార్ల కళ్యాణం ప్రత్యక్ష ప్రసారం చూస్తూకూర్చున్నాము!!

ఈ ప్రమాదం జరగడానికి ముందు పూజ్యశ్రీ అమ్మగారు ఒకసారి స్వప్నంలో నాకు దర్శనమిచ్చి, నా కారు తాళాలు అడిగి తీసుకుని, మళ్ళీ, “ఇదుగో నీ కారు తీసుకో!” అని ఇచ్చేశారు. నేను ఈ స్వప్నం అంతగా పట్టించుకోలేదు. మా కారు బాగా పాడైపోవడం వల్ల కొత్త కారుకి నమోదు చేసుకున్నాను. చాలా తొందరగా, నెలలోపే కొత్తకారు వచ్చింది! సాధారణంగా ఇక్కడ ప్రమాదానికి గురైతే నమోదు చేసుకున్నాక కారు రావడానికి చాలారోజులు పడుతుంది. అయితే స్వపంలో చెప్పినట్లు, నా పాత కారు తీసుకుని కొత్తకారు పూజ్యశ్రీ అమ్మగారే ఇప్పించారనిపించింది. అది ఇంకొక అద్భుతం!

ప్రమాదం జరిగిన నెలరోజుల తరవాత మరొక స్వప్నం వచ్చింది. అందులో నేను బాబాకు పూజ చేస్తుంటే, నా కారుకి ఏవైపైతే ప్రమాదం జరిగిందో, బాబా పటంలో ఆ వైపున అద్దం పగిలిపోయింది. నేను, ‘ఇలా జరిగిందేమిటా?!’ అని భయపడుతున్నాను. ఈలోపల పూజ్యశ్రీ అమ్మగారు తలుపు తీసుకుని మా ఇంట్లోకి వచ్చారు. నేను, మా అమ్మ పూజ్యశ్రీ అమ్మగారి పాదాల మీద తలవుంచి ఏడుస్తూ జరిగినది చెప్పాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, “బాబా పటం అలా అవ్వడం గురించి ఏమీ భయపడకండి. మీ ప్రమాదం మేము తీసుకుని మిమ్మల్ని కాపాడాము!” అని చెప్పారు. ఎంతటి కరుణామూర్తులు వారు!! వారి అపారకరుణకు కృతజ్ఞతతో మనసు నిండిపోయింది.. పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందిన ముందురోజున మా ఇంట్లో బాబా పటం కిటికీ లోంచి బయటకు వెళ్ళిపోతున్నట్లు, అలా వెళ్లిపోతున్న బాబా పటాన్ని మా తమ్ముడితో నేను పట్టుకొమ్మని చెప్పినట్లు నాకు స్వప్నం వచ్చింది. మర్నాడు ‘ఇలా స్వప్నం వచ్చిందేమిటా!’ అనుకుంటుంటే, పామూరులో వున్న మా అన్న ఫోన్ చేసి, పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందినట్లు చెప్పాడు.

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందిన తర్వాత వారి మాసిక పూజ రోజున ఒక స్వప్నం వచ్చింది. అందులో నన్ను, నా భార్యని పూజ్యశ్రీ అమ్మగారు వారి సమాధి స్థానమైన గుమ్మళంపాడుకు తీసుకెళ్లారు. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారితో పాటు ఒక అబ్బాయి వున్నారు. ఆయన యువకుడైన పూజారిలా వున్నారు. పూజ్యశ్రీ అమ్మగారు అతన్ని వాళ్ళ అబ్బాయని చెప్పారు. ఆయన పాదాలకి నమస్కారం చేసుకున్నాము. ఆయన నాతో, “నువ్వు బాగా పుస్తకాలు చదువుతావు కదా?!” అన్నారు. ఈలోపల పూజ్యశ్రీ అమ్మగారు, “ఇక్కడ నేను, మా అబ్బాయి దత్తాత్రేయుడు, వచ్చినవాళ్లకు భోజనం పెట్టి, వాళ్లకి ఏమైనా సమస్యలుంటే తీరుస్తుంటాము” అని చెప్పారు. సాయంత్రం వరకూ నన్ను, నా శ్రీమతిని వారిదగ్గరే కూర్చోపెట్టుకున్నారు. వారి అబ్బాయి మాతో ఎన్నో గ్రంథాల గురించి చర్చ చేశారు. ఇది ఆ స్వప్న వృత్తాంతం! ఇంకా యిలా చాలా స్వప్నాలు ప్రసాదించారు. ఎన్నో సూచనలు చేశారు.

ఈ విధంగా పూజ్యశ్రీ అమ్మగారు మా కోరికలు నెరవేరుస్తూ,ఆపదలనించికాపాడుతూ,మాఇలలో,కలలో, మా మనసులలో, నిత్యసత్యులై వెలుగొందుతున్నారు. ఇంతదూరంలో వుండి రాలేకపోయినా మాతృదేవి తమ దివ్యసన్నిధిని మాకు అనుభవింపచేశారు. ఆ తల్లి కరుణా కటాక్షాలు మాపై ఎప్పుడూ యిలాగే వర్షించాలని, అంజలి ఘటించి అర్థిస్తున్నాను.●

# మాతృదేవి జన్మ దినోత్సవ వేడుకలు


**_శ్రీమతి టి. పద్మావతి_**

మనందరి పుట్టుకకు కారణమై లోకాలన్నింటినీ ఏలే జగజ్జనని శ్రీ అలివేలుమంగమ్మ తల్లి జయంతిని ఆనందోత్సాహాలతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవడానికి పరిసర గ్రామాల నుంచే కాక, తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలనుంచి కూడా, భక్తులు సన్నిధానమునకు తరలివచ్చారు. అక్టోబరు 1వ తేదీకి ముందురోజే సన్నిధానమును అంగరంగవైభవంగా తీర్చిదిద్దారు. శిరిడీ సాయినాథులు, వారి శిష్యులు భరద్వాజుల మధ్యన ప్రేమాప్యాయతలు కలబోసిన దృక్కులతో పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి వేదికను అలంకరించారు.

వుదయమే మేలుకొలుపుతో మొదలైన జయంతి వుత్సవం, వరుసగా కాకడ ఆరతి, దివ్యమంగళస్నానాలు, అల్పాహార నివేదన పూర్తయ్యాక, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ సేవ జరిగింది. ఆ సమయంలో శ్రీ ద్వారక బాబుగారు కొంతసేపు సత్సంగం చేశారు.

## గురుపుత్రులు శ్రీ ద్వారక బాబుగారి సత్సంగము

విశ్వమంతా వ్యాపించి అన్ని రూపాలలోనూ, అలానే సూర్యచంద్రాదుల నుంచి, నక్షత్ర గ్రహగతుల దగ్గర నుంచి వుచ్ఛ్వాస నిశ్వాసల దాకా, ఇలా



మాట్లాడాలి అంటే మాట్లాడడానికి కావలసిన ఆలోచన, ఆలోచనకు తగ్గట్టుగా కంఠం నుంచి ధ్వని రూపంలో పనిచేస్తున్న శక్తిదాక, అన్నింటినీ నడిపిస్తూ, విశ్వానికి ఆధారం అయిన ఒకటే ఒక శక్తి ఏదైతే వుందో దాని పేరు భగవంతుడు.

ఈ సృష్టి మొత్తాన్ని నడిపేటప్పుడు రకరకాల సన్నివేశాలు, రకరకాల రాక్షసులు ఏర్పడతారట. వారిని సంహరించడానికి తిరిగి భగవంతుడు అవతారం ధరించి దిగి వచ్చాడట. అంతటినీ భగవంతుడే సృష్టిస్తే అందులో రాక్షసులు ఎక్కడ పుట్టుకొచ్చారు? వారిని సంహరించడానికి మళ్ళీ ఆయన అవతరించడం ఏమిటి? ఇది పెద్ద ప్రశ్నగా వుంటుంది. ఇది ఎప్పటి దాకా వుంటుంది అంటే మన జీవితాన్ని మనం గమనించుకునే

దాకా, మన ప్రవర్తన మార్చుకునేదాకా ఈ ప్రశ్నలన్నీ అలా మిగిలిపోతాయి. విశ్వమంతా భగవంతుడే నిండి వుంటే నీకు అలా ఎందుకు కనిపించడం లేదు?

ఒకటి మంచి ఒకటి చెడు, ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ, ఒకటి సుఖము ఒకటి దుఃఖము, అనే విధాలుగా ఎందుకు అనుభవం అవుతున్నదని గమనిస్తే, 'ఓహో! ఇవన్నీ ఒకటిగా వున్నా, దీని పర్యవసానాన్ని నేను చూస్తున్నాను. కానీ దీని వెనుక వున్న ఏకత్వాన్ని చూడటం లేదు' అని తెలుస్తుంది. మరి ఆవిధంగా చూడకపోవడానికి కారణం ఏమిటని ఆలోచిస్తే, మన ఇంద్రియాలు అలా పని చేయడం వల్ల అలా కనిపిస్తోందని అర్థం అవుతుంది.

అంటే ఒక కాకరకాయ ముక్కని, ఒక ఆపిల్ ముక్కని రెండు చేతుల్లో పెట్టుకుంటే చేదు తీపి తెలియదు. తల మీద పెట్టుకున్నా, బుగ్గకానించుకున్నా తెలియదు. కానీ నాలిక పైన పెట్టినప్పుడు మాత్రం రుచిలో భేదాన్ని ఇంద్రియానుభవం ద్వారా దానిలో వైవిధ్యం మనకి కనబడుతోంది.

ఇంద్రియాలు ఎలా గుర్తిస్తాయంటే, మనసు ఎలా పనిచేస్తుందో దాన్ని బట్టి గుర్తిస్థాయి. ఈ మనస్సు, లోపల వున్న భావోద్రేకాలు ఆలోచనల మీద ఆధారపడి వుంది, అందువల్ల సృష్టి వైవిధ్యంగా గోచరిస్తుంది. ఈ మనఃస్థితి వల్ల ఇలా వైవిధ్యంగా గోచరిస్తోంది కానీ, వాస్తవానికి దీంతో సంబంధం లేకుండా ప్రకృతి నడుస్తోంది కదా అన్న విషయం గుర్తుంచుకోమంటే గుర్తించుకోదు. ఇట్లా అంతా భగవంతుడిగా చూసే ప్రయత్నం చేస్తుంటే, అడ్డుగా కొంతమంది రాక్షసులు పుట్టుకొచ్చారు. ఈ సృష్టిలో వైవిధ్యం వల్ల మనకి అడ్డంకులు వస్తున్నాయని జాగ్రత్తపడి వెనుక వున్న భగవంతుడిని గుర్తుపెట్టుకుంటావనుకుంటే, నువ్వు ఆ వెనుక వున్న సిద్ధాంతాన్ని వదిలేసి వీటిని పట్టుకున్నావు. ఇది మన సమస్య!

లోపాలు చూసే తత్వము, లోపాలు చూసే మనసు ఈ రెండూ కలిసి సృష్టిని ఎంతతేడాగా చూస్తాయో అంతగా మనకు భగవంతుడు కనపడకుండా పోతాడు. కనిపించే అవకాశమే లేదు. ఉదాహరణకి కాలికి దెబ్బ తగిలితే రెండో కాలు బాగున్నా సరే అయ్యో ఈ కాలుకి దెబ్బ తగిలింది అని ఏడుస్తుంది మనస్సు. ఇది మనసుకు వుండే లక్షణం. డబ్బులుంటే బాగుంటాం, పేరు వుంటే బాగుంటాం. అందరం మంచి అనుకుంటే బాగుంటాం అనుకుంటాము. ఇవన్నీ పొందడం కోసం కొంతమంది వుద్యోగాలు చేస్తాం, వ్యాపారాలు చేస్తాం. కానీ బాగుండము. మన లోపల మిషన్ యొక్క తత్వం మారిస్తే బాగుంటాము. బుద్ధుడు లాంటివాడు ఏమీ లేకపోయినా ఆనందంగా వున్నాడు. పాకలపాటి గురువుగారు లాంటివాళ్ళు అడవి మధ్యలో హాయిగా వున్నారు. మనం ఎందుకు అలా లేము? – అంటే మన లోపల వున్న మిషన్ అలాంటిది. ఎక్కడో కొంతమంది అదృష్టవంతులకి భగవదనుగ్రహం కలిగిన వాళ్లకి మిషనరీ మార్చుకుని బతకడం ఎలాగో చూపించేవాళ్ళు దొరుకుతారు. వాళ్ళనే మహాత్ములు అంటారు. అప్పుడు మనకి మనసు పనిచేసే తీరు, ఇంద్రియాల ద్వారా చూసే వైవిధ్యము, ఇవన్నీ భగవంతుని కలలుగా కనిపిస్తాయి, సృష్టి నియమాలు ధర్మాలుగా కనబడతాయి. అన్నీ వారి రూపాలుగా కనపడతాయి. ఆ స్థితి వచ్చాక అన్నీ ఆయనే నడుపుతున్నాడు అన్న భావం దృఢపడి మనసు వుత్సాహము, ఆనందము, కృతజ్ఞత పొందుతుంది. ఆ స్థితి కలిగాక వచ్చినదాన్ని భక్తి అంటారు. అనన్య చింతన, సేవ, శరణాగతి, నిష్కామకర్మ, ఇవన్నీ అప్పుడే పుడతాయి. వీటన్నిటినీ కలిపి యోగమయ జీవితం అంటారు.

అప్పుడు ఏ సన్నివేశం వస్తే ఆ సన్నివేశం నచ్చుతుంది. ఏ జన్మ వస్తే ఆ జన్మ నచ్చుతుంది. ఈ విధానం చెప్పే అతి అరుదైన మహాత్ముల్లో ఒకరు పూజ్యశ్రీ మాస్టరుగారు. వారి గ్రంథాలను తీసుకొని లోపలది రిపేర్ చేసుకున్నాక, ఒకానొక రోజున సృష్టి పట్ల, జీవితం పట్ల మనకు తృప్తి, ఆనందము కలిగి, దాన్ని కలిగించిన భగవంతుడి పట్ల కృతజ్ఞత కలిగి, ఆ రోజు

నుంచి జీవితం బాగుంటుంది. బాగుండటమే కాదు, అందరిలోనూ భగవంతుడిని మనం చూస్తూ వుంటాం కనుక అందరిలోంచి భగవంతుడు పలకడం మొదలు పెడతాడు. దాన్నే లీలలు, అనుభవాలు అంటాము.

రిపేర్ చేసుకోవడం మొదలుపెట్టాక అప్పటిదాకా వున్న అభిప్రాయాలని పక్కన పెట్టాల్సి వస్తుంది. అవి అడ్డం వస్తూనే వుంటాయి. రక్తబీజుడు పుడుతూనే వుంటాడు. దీనికి ఒకటే మార్గం, ఈ సృష్టిని చూస్తూ మనసు ఏర్పరచుకునే అభిప్రాయం మారే దగ్గర దెబ్బ తగిలితే కానీ అవదు. అంటే రోజూ ఆచమనం చేస్తే మనకు ఏమీ రాదు. దాన్ని ఎందుకు చేయాలో తెలుసుకుని అలా చేస్తే మాత్రమే మార్పు వస్తుంది. ఒకే శక్తి సకల రూపాలలోనూ వున్నదని మన లోపల అభిప్రాయాన్ని మార్చుకోవడం మొదలుపెట్టగానే ఇక రక్తబీజుడు పుట్టడం ఆగిపోతుంది.

అమ్మవారు నాలిక చాచారట, రక్తం నేల మీద పడలేదట, మళ్ళీ రక్తబీజుడు పుట్టలేదట. ఇది దసరాల్లో చెప్పే కథ. ఇది సాధించే రకరకాల మార్గాలు చెప్పారు మహాత్ములు సులువులు చెప్పారు, దాని ప్రకారం మారదాము అన్నప్పుడు మాత్రమే మార్పు వస్తుంది. అప్పుడు బెటర్ గా వుండే అవకాశాలు సన్నివేశాలు వస్తాయి. సేవ చేసే అవకాశం, పారాయణ చేసుకునే అవకాశం, నామం చేసుకునే అవకాశం, సత్సంగం చేసుకునే అవకాశం అన్నీ వస్తాయి. ఈ అవకాశాల వెనుక భగవంతుడి కరుణ, కృప కనబడతాయి. 'భగవంతుడు ఒక్కడే అంతటా వున్నాడన్న అనుభవాన్ని పొందడానికి నా జీవితాన్ని నడుపుకుంటాను' అని నిర్ణయం తీసుకునేవాడిని బ్రహ్మచారి అంటారు. అలా నిర్ణయం తీసుకున్నాక మహాత్ముల బోధలు అవగాహన చేసుకుని మనలో మార్పు తెచ్చుకోకపోతే గొప్ప వైద్యుడు దగ్గరికి వెళ్లి వాళ్ళు ఇచ్చే మందు, పథ్యం తీసుకోనట్టే అన్నారు.

పూజ్యశ్రీ అమ్మగారి జన్మదినం సందర్భంగా ఒక మంచి ఆలోచన ఏమిటంటే, ఇది మాస్టరుగారి గ్రంథాలతో కానీ, అమ్మగారి గ్రంథాలతో కానీ చేయొచ్చు. పూజ్యశ్రీ అమ్మగారు రచించిన 'ఆధ్యాత్మిక జాగృతి' గ్రంథాన్ని తీసుకొని పూజ్యశ్రీ అమ్మగారికి తాకించుకుని, అందులో వ్రాసిన ప్రతి వ్యాసం ఒకటికి రెండుసార్లు చదువుకుంటూ, మనతో పూజ్యశ్రీ అమ్మగారు మాట్లాడుతున్నట్లు భావించుకొని, 'ఇవాళ మనకు ఎటువంటి బోధ అందిస్తారు' అని భావించుకుంటూ, ఆ అధ్యాయం చదువుకుంటూ, అవగాహన చేసుకుంటూ దాని ప్రకారం జీవితాన్ని మార్చుకోవడానికి ఈరోజు నుంచి మొదలు పెట్టండి. అలా అవగాహన ప్రకారం మార్పు వచ్చిన తర్వాత, ఇంకో అధ్యాయం మొదలు పెట్టండి. వారు చెప్పినవన్నీ మనం పాటిస్తున్నామా లేదా అన్నదే మన ప్రాసెస్, అదే ధర్మం. అలా ప్రయత్నిస్తే పూజ్యశ్రీ అమ్మగారి దయతో పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు బెటర్ గా అర్థమవడం మొదలుపెడతాయి.

వారి జన్మదిన సందర్భంగా మన మనసు రిపేర్ అయి, అన్నిట్లో భగవత్ తత్వాన్ని చూసి ప్రశాంతంగా జీవించగలిగే భక్తి వైపుకు అందరినీ నడపమని, దానికి కావలసిన ప్రయత్నం చేయాలనే నిర్ణయాన్ని మనం తీసుకోవాలని, అటువంటి ప్రయత్నం సరిగ్గా చేసేటట్టు అనుగ్రహించమని పూజ్యశ్రీ అమ్మగారిని ప్రార్థిస్తున్నాను.

దివ్యజనని అలివేలుమంగమ్మ జన్మదిన సందర్భంగా వారు అవతరించినందుకు కృతజ్ఞతగా వారికి ప్రత్యేక పూజా కార్యక్రమం జరుగుతుంది. అందరూ శ్రద్ధగా పాల్గొనవలసింది అంటూ గురుపుత్రులు వారి సత్సంగాన్ని ముగించారు.

అనంతరం గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు, భక్తులందరి తరపున పూజ్యశ్రీ అమ్మగారికి దత్తాత్రేయ అష్టోత్తర శతనామ పూజ జరిపారు. అనంతరం వారు మాట్లాడుతూ,,,ఈరోజు సాయంత్రం ఒకచిన్నారి గీతం సేవ చేసుకుంటాడు, మా చిన్నారి నృత్యం సేవ చేసుకుంటుంది. అందరూ పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుని, ఆశీస్సులు తీసుకుని, ప్రసాదం తీసుకుని, సాయంత్రం కార్యక్రమాలకు హాజరవుదాము

అనిచెప్పి ఆ పూట కార్యక్రమాలకు స్వస్తి చెప్పారు.

సాయంత్రం కార్యక్రమంలో, చిరంజీవి ప్రణవ్ అనే కళాకారుడు, మహా గణపతిం మనసా స్మరామి అనే కీర్తనతో మొదలుపెట్టి, మీనాక్షి, కాశీవిశాలాక్షి మొదలైన అమ్మవార్లను స్తుతిస్తూ కొన్ని కీర్తనలు, అంబ పంచరత్న స్తోత్రం మొదలైనవి బహు హృద్యంగా ఆలపించి, పూజ్యశ్రీ అమ్మగారికి గీతం శ్రావయామి సేవ చేసుకున్నాడు. శ్రీ ద్వారకబాబుగారు, చిరంజీవి ప్రణవ్ కి పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం, కొన్ని గ్రంథాలు బహూకరించారు. తరువాత నాట్యప్రదర్శన జరిగే ముందు శ్రీ బాబుగారు మాట్లాడుతూ,,,, పూజ్యశ్రీ మాస్టరుగారు వారి గ్రంథాలలో కళలగురించి ప్రస్తావించారు. సాయినాథులవారు తాకియాకు వెళ్ళి గజ్జకట్టి నృత్యం చేసేవారని, ఆయన పిల్లనగ్రోవి పట్టుకుని నృత్యం చేస్తే సాక్షాత్తు శ్రీకృష్ణుడిని చూసినట్లు వుండేదని అక్కడివాళ్ళు చెప్పారని పూజ్యశ్రీ మాస్టరుగారు రాస్తూ,,, తరువాత కూడా ఈ కళల పట్ల బాబాకి ఆసక్తి వుండేదని, అయితే వాటిని ఆధ్యాత్మికతకు మాత్రమే వినియోగించుకోవాలి, లేకుంటే వ్యక్తికి సమాజానికి పతనం తప్పదని అన్నారని మనం సాయిలీలామృతము లో చదువుకుంటాము. అలాగే ఏదినిజం గ్రంథం చివరలో భగవంతుడు ఈ సృష్టిని చేసిన విధానము గురించి చెబుతూ, కళాకారుడు కళని సృష్టించేటప్పుడు కానీ, చూసేటప్పుడు కానీ, ఆనందము ఎందుకు వస్తుంది అంటే విశ్వచైతన్యానుభూతిని మచ్చుకు కొంత ఇందులో పొందడానికి అవకాశము వున్నది అని చెప్తూ, వీటిని అంత పవిత్రం గానే వాడుకోవాలి కానీ, అన్యథా వాడుకుంటే వ్యక్తిగతంగా సామాజికంగా పతనం తప్పదు అని మళ్ళీ చెప్పి,,దీన్ని పురుషసూక్త రహస్యము అన్న గ్రంథములో కూడా పొందుపరచారు.

పూజ్యశ్రీ మాస్టరుగారికి కూడా సంగీత పరిజ్ఞానం వుండేదట,,,అనిచెప్తూ, కళలు దాని విశిష్టత గురించి వివరించి, ప్రతివారూ తప్పకుండా ఏదో ఒక కళని అభ్యసించడం మానవులుగా మనకర్తవ్యం అని చెప్పారు. తరువాత చిరంజీవులు కైవల్య, హన్షిత నృత్యం దర్శయామి సేవని పూజ్యశ్రీ అమ్మగారికి చేసుకున్నారు. వారిరువురికి శ్రీ బాబుగారు ప్రశంసాపత్రాలు, పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలు బహుకరించారు.

ఇక్కడికి వచ్చి వారి సన్నిధిలో వున్న అందరికీ, అనివార్య కారణాల వల్ల రాలేకపోయిన వారందరికీ, వారి దివ్యమైన ఆశీస్సులు ప్రసాదించి పూజ్యశ్రీ మాస్టరుగారికి నచ్చిన మార్గంలో జీవితాలు నడిచేట్టుగా అనుగ్రహించమని, గురుదంపతులు అలివేలుమంగా భరద్వాజులకి, సాటిలేని సమర్థ సద్గురువులు శిరిడీ సాయినాథులవారికి, శత సహస్ర కోటి ప్రణామాలు చేస్తూ, ఈ జన్మదిన కార్యక్రమాల్లో సేవ చేసుకునే అవకాశం కల్పించిన మీకు కృతజ్ఞతలతో ఈరోజు కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం అంటూ ద్వారకబాబుగారు ముగింపు పలికారు.

## విజయదశమి మహోత్సవం

మరురోజు అక్టోబర్ 2, విజయదశమి మహోత్సవం. నవరాత్రుల అమ్మవారి పండుగతో పాటు, సాటిలేని సమర్థ సద్గురువు శ్రీ శిరిడీ సాయినాథులు విశ్వవ్యాపకమైన రోజు. సాయి భక్తులందరికీ అత్యంత ముఖ్యమైన రోజు. ఆ రోజున పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి సాయినాథునికి అనేక రకాలైన మందార పూలతో పూజ చేయమని ఆనతిచ్చారు. ఆ సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. కనుక శ్రీ సాయినాథుని సమాధి వుత్సవం, మరొకవైపు మందార పూలతో విశేషమైన పూజ – ఈ రెండు పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధానము నందు ఏవిధంగా జరిగాయో ఇప్పుడు చూద్దాం.

విజయదశమి మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సాయినాథులు తన ప్రియశిష్యులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారినీ, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లినీ చెరోవైపు ఆసీనులు గావించుకొని, వారిద్దరి మధ్య దివ్యశోభలతో, చిత్రపటం రూపంలో వెలుగొందారు.

ఎప్పటిలాగే రోజు కూడా వుదయం 5.30 గంటలకు మేలుకొలుపు, కాకడ హారతి, దివ్య మంగళ జలాలతో అభిషేకం, సర్వాంగ సుందరంగా పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి సమాధి అలంకరణ, అనంతరం అల్పాహార నైవేద్యం పూర్తయ్యాక, సేవకులు ప్రత్యేక పూజకు పూజా ద్రవ్యాలు సమకూరుస్తూ, అలివేలు మంగమ్మ తల్లి సమాధి అలంకరణకి మెరుగులు దిద్దుతూ వుండగా గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ గారు కొంతసేపు సత్సంగం నిర్వహించారు. అందులో కొన్ని విశేషాలు,,,

## విజయదశమి నాడు గురు పుత్రుల సత్సంగము

ఈరోజు ముఖ్యమైన కార్యక్రమం 108 రకాల మందారాలతో శిరిడి సాయినాథులవారికి పూజ! ఇది ఎలా మొదలైంది అంటే, పూజ్యశ్రీ అమ్మగారు అనారోగ్య కారణంతో ఒకసారి ఆసుపత్రిలో చేరారు. వారు పూర్తిగా మన స్పృహలో లేరు. ఒకసారి కొద్దిగా స్పృహ వచ్చినప్పుడు, మమ్మల్ని అందరినీ పలకరించారు. “అమ్మా! పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం, విజయదశమి ఎలా చేసుకుంటే బాగుంటుంది?” అని అడిగాం. అప్పుడు అమ్మగారు, “విజయదశమి రోజున 108 రకాల మందారాలతో పూజ చేయండి” అన్నారు. అప్పుడు అందరు తలొక వైపు పరిగెత్తి వీలైనన్ని తీసుకుని వచ్చి పూజ చేసుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం దొరుకుతాయా లేదా అనుకోవడం, ఎక్కడెక్కడ నుంచో తెప్పించడం, మొత్తానికి లెక్క సరిపోవడం, శిరిడి సాయినాథునికి పూజ చేసుకోవడం జరుగుతోంది. ఆ ప్రయత్నం ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది.

మనమే మందార మొక్కలు నాటి, పువ్వులు సమకూర్చుకుందామని చాలా ప్రయత్నాలు చేసాము. కానీ ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, మొక్కలు సరిగా రాకపోవడం వల్ల, పువ్వులు సమకూడ లేదు. మొత్తానికి బయట నుంచి తెప్పించి 108 రకాలు పూర్తి చేస్తున్నాం. కానీ ఇప్పటినుంచి ప్రతి వాళ్ళు ఇంట్లో కనీసం రెండు రకాల మందార చెట్లయినా వేసి, ప్రతినిత్యం పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించి, విజయదశమికి వచ్చేటప్పుడు ఆ పూలను ఇక్కడ సమర్పిస్తే మనందరి ఇళ్లల్లో వున్న పూలతో 108 రకాలు వచ్చే అవకాశం వుంటుందని నేను భావిస్తున్నాను. ఈ సంవత్సరం వీలైతే అలాంటి ప్రయత్నం అందరూ చేయండి. ఇది అందరూ ఒక సేవగా పెట్టుకోవచ్చు.

ఆధ్యాత్మికతలో నిన్న మనం చెప్పుకున్నట్లు, మనసు రకరకాల భావోద్రేకాలతో పరిగెట్టడం గాని, లేకపోతే ఇంద్రియానుభూతుల వల్ల కలిగే రకరకాల ఆలోచనలతో కొట్టుకోవడం వల్ల, సృష్టి ఎలా పనిచేస్తుందో అలా చూడడం మానేసి మనకు తోచిన అభిప్రాయంతో చూడడం జరుగుతుంది. అలా చూడటాన్ని ''మాయ, అజ్ఞానం' అంటారు. వున్నది వున్నట్టు చూడ్డానికి చేసే ప్రయత్నాన్ని 'సాధన' అన్నారు. అనుభూతి పొందడాన్ని 'బ్రహ్మజ్ఞానం' అన్నారు.

ఇలా అనుభూతి పొందాలంటే మనసులో అనవసరమైన ఆలోచనలు తగ్గడం అనేది కీలకం. దానికి ఒక చిత్రమైన విధానం ఏంటంటే,,, మనసుని మనసుతోనే కేంద్రీకరణ చేసి దాన్ని కట్టడి చేయడం. బాహ్యమైన వస్తువులతో దాన్ని కట్టడం చేయవచ్చు వుదాహరణకి ఏదేదో ఆలోచిస్తున్న మనస్సు, మనం వేగంగా నడవడం వల్ల కొంచెం వశమవుతుంది. లేదా వేడిపాలు నిండా వున్న గ్లాసుని పట్టుకొని, పాలు ఒలకకుండా నడిచే ప్రయత్నం ద్వారా, శ్వాస మొదలైనవి గమనించడం ద్వారా మనసులో ఆలోచనలు తగ్గించవచ్చు. లేదా ఒక కీర్తన మీద కానీ, ఒక భావం మీద కానీ, ఒక నామం మీద కానీ మనసును లగ్నం చేయవచ్చు. లేదా శ్రద్ధగా ఒక చెంచా నీళ్లు తీసుకుని వారి పాదాల మీద వేస్తూ వుంటే ఆలోచనలు పోతాయి. ఇలాంటి టెక్నిక్స్ అన్నీ అందరు వినే వుంటారు. అయితే మంత్రోచ్చారణ, ధ్యానము మొదలైవన్నీ ఎంతో ప్రయోజనకరమైనప్పటికీ, వున్న సమస్య ఏంటంటే, ఇవి చేస్తున్నప్పుడు జీవితాన్ని కాసేపు ఆపాల్సి వస్తుంది. శ్వాసని గమనిస్తూ వంట,

వుద్యోగం చెయ్యలేము. ఎందుకంటే మనసు రెండు పనులు ఒకేసారి చెయ్యలేదు. చేసి గెలిచిన వాళ్ళు లేరనికాదు, కానీ చాలా తక్కువ.

మరి ఎట్లా అంటే,,, దానికి శిరిడి సాయినాథులవారు, పూజ్యశ్రీ మాస్టరుగారు, వివేకానంద స్వామి, మొదలైనవారు ఏం చెప్పారంటే – 'జీవితం వేరు సాధన వేరు' అనుకున్నంతసేపూ ఇది నడవదు. 'నేను రోజు కాసేపు ధ్యానం చేస్తాను' అనే వాడికి 'చేస్తున్నాను' అన్న భావన తప్పించి ఏమీ మిగలదు. జీవితమే సాధనగా మలుచుకుంటే తప్పించి వేరే దారి లేదు. ఎందుకంటే రోజులో కొంతసేపు భగవంతుని గురించి ప్రార్థన చేసి మిగతారోజంతా వేరేగా బ్రతుకుతూ వుంటాము. ప్రతినిత్యం చేసే పనులన్నీ సాధనగా చేసుకుంటే తప్ప వేరేరకంగా ఆధ్యాత్మికత కుదరదు. ఇంట్లో వంట మనకోసం చేయడం మానుకుని నైవేద్యం కోసం చేయడం అనే ప్రాక్టీస్ మొదలు పెట్టాలి. భోజనం చేయడం వారి ప్రసాదం స్వీకరించడంగా మారాలి. ఇల్లు 'మన సొంతిల్లు మనమే వుంటాం' అన్నది పోయి ఆశ్రమవాటికగా మారాలి. మాస్టరు గారి గ్రంథాలు చూసుకుంటూ వస్తే, ప్రవచనాలు గాని, లీలామృతం గాని, ఏది చదివినా వీటన్నిటిలో ఇటువంటి భావాలు పెంచుకోవడం చెప్తారు. అందుకని మనం ఆచరించవలసిన విధానం ఏంటంటే జీవితం అంతా భగవంతుని పరంచేయడం!

శిరిడి సాయినాథులవారు విశ్వవ్యాపకుడై, అందరిలోనూ, అన్నింటిలోనూ భగవంతుడిని చూసేటట్టు ఎన్నో లీలలు చేసి, వారి చరిత్ర ద్వారా బోధించి, పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాల ద్వారా బోధించిన జీవిత విధానానికి, ఏ రోజైతే మనం వున్ముఖం అవుతామో అప్పుడు ఫలితం బాగుంటుంది. అలా చెయ్యలేకపోతే అన్ని రోజులు లాగా విజయదశమి కూడా వచ్చి వెళ్ళిపోతుంది. బాబా శరీరాన్ని చాలించడానికి సంవత్సరం ముందర "ఈ రోజే నా సీమోల్లంఘనం" అన్నారు. 'నేను హిందువునా, ముస్లింనా తేల్చుకోండి' అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకి సమాధానం సంవత్సరం తరువాత విజయదశమి రోజున వారే చెప్పారు. ఆ ప్రశ్నకు తావే లేకుండా వారి సమాధి మందిరం విశ్వవ్యాపకంగా, ఆధ్యాత్మిక సాధనామార్గంగా విరాజిల్లుతోంది. అందరిలో భగవంతుడిని చూడడం వచ్చేవరకు, ఇలాంటి క్షేత్రాలను కేంద్రంగా పెట్టుకుని, అక్కడ భగవంతుడిని దర్శిస్తూ అంతా ఆయనే వున్నాడని గుర్తుపెట్టుకోవాలి. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆచరించి చూపించినది అదే.

విజయదశమి సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారు వారి జీవితంలో ఆచరించి చూపించిన శిరిడి సాయినాథుని తత్వము, ఈ విశ్వం మొత్తానికి వునికిని పద్ధతిని ప్రసాదించి, క్రమపద్ధతిన ఈ సృష్టి మొత్తాన్ని నడుపుతున్న గురుదేవులు, నన్ను సరైన మార్గంలో నడిపి వారు సంకల్పించిన కార్యక్రమాలకు వుడతా భక్తిగా సేవ చేసుకునే అవకాశాన్ని ప్రసాదించి, వారి ప్రసాదించిన ఈ జన్మను సార్ధకమయ్యేలా చేయమని వారికి ప్రార్థన చేసుకుంటూ, పూజ్యశ్రీ అమ్మగారి ఆజ్ఞానుసారం చేయబోయే మందార పూల పూజలో గాని, నిన్నటి జన్మదిన వుత్సవాల్లో కానీ, ఇప్పుడు నేను మాట్లాడిన మాటల్లో కానీ, భావాల్లో కానీ ఏమైనా పొరపాట్లు వుంటే మన్నించి మనందరినీ అనుగ్రహించమని ప్రార్థన!! అంటూ తన సత్సంగాన్ని ముగించారు.

తర్వాత శ్రీమతి వేదమ్మగారు 108 రకాల మందారాలతో భక్తులందరి తరపున శ్రీ సాయినాథునికి అష్టోత్తర శతనామ పూజ గావించారు. అనంతరం విజయవాడకు చెందిన గురు బంధువుల అమ్మాయి 'శ్రీ దత్త సాయి మంగ భరద్వాజ షణ్ముఖి' కి శ్రీమతి వేదమ్మగారు అక్షరాభ్యాసం చేశారు. తర్వాత భక్తులు ఒక్కొక్కరుగా సమర్థ సద్గురు సాయినాథునికి, అలివేలుమంగా భరద్వాజులకి సంపూర్ణ ఆశీస్సులను అనుగ్రహించమని నమస్కరించుకుని, విజయదశమి కార్యక్రమానికి స్వస్తి పలికారు.●

# వార్తాలాపము

(సెప్టెంబరు సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## 16వ ప్రసంగము

### వాచిక పాపాలు:

స్వా॥ప్ర॥: సత్వగుణ లక్షణాన్ని మనువు యిలా చెప్పాడు–

**శ్లో॥ పౌరుష్యమనృతం చైవ**
**పైశున్యం చాపి సర్వశః।**
**అసంబద్ధ ప్రలాపశ్చ**
**వాఙ్మయం స్యాచ్చతుర్విధమ్॥**

భావం: కఠినమైన మాటలు, అసత్యపు సంభాషణలు, చాడీలు చెప్పడం, అనవసరమైన మాటలు చెప్పడం – అనే ఈ నాలుగూ వాచిక పాపాల రకాలు.

### కాయక పాపాలు (శారీరకమైన పాపాలు):

**శ్లో॥ అదత్తానాముపాదానం**
**హింసా చైవా విధానతః।**
**పరదారోపసేవా చ**
**శారీరం త్రివిధం స్మృతమ్॥**

భావం: దొంగతనము, నిషిద్ధమైన హింస, పరస్త్రీల దగ్గరకు వెళ్లడము – ఈ మూడు శారీరిక పాపాలు.

ఈ మూడు పాపాలకూ దూరంగా వుండే ఆచరణే తపము. ఈ మూడు రకాలైన పాపాలను చేయనివారు పాపనివృత్తి కోసం కృచ్ఛ్ర, చాంద్రాయణ వ్రతాల వంటివేవీ చేయనవసరం లేదు.

తపః ప్రభావము చాలా గొప్పది.

**శ్లో॥ యత్ దుస్తరం యత్ దురాపం**
**యత్ దుర్గం యచ్చ దుష్కరమ్।**
**తత్సర్వం తపసా సాధ్యం**
**తపో హి దురతిక్రమమ్॥**

భావం: దేనిని దాటడం కష్టమో, దేనిని పొందడం కష్టమో, దేనియందు ప్రవేశించడం కష్టమో, దేనిని చేయడానికి శ్రమపడాలో అవన్నీ తపస్సుచేతనే సిద్ధిస్తాయి. తపశ్శక్తిని ఉల్లంఘించడం కష్టం.

## జ్ఞానమ్

పరోక్షము, అపరోక్షము అని జ్ఞానము రెండు రకాలు. శాస్త్రాల ద్వారాను, గురువు ద్వారాను పరమార్థ తత్త్వస్వరూపుడైన పరమాత్మ వున్నాడనే నిశ్చయాన్ని పొందడం పరోక్షజ్ఞానము. శ్రవణము చేసిన పరమాత్మ స్వరూపాన్ని మనన నిధిధ్యాసనముల ద్వారా ప్రత్యగాత్మ స్వరూపంతో అభేదంగా సాక్షాత్కారం జరగడం అపరోక్షజ్ఞానము. ఇది జ్ఞానానికి చెప్పే సామాన్య వివరణ.

జ్ఞానము సాత్వికము మొ॥న భేదాల చేత మూడు రకాలుగా శ్రీమద్భగవద్గీతలో వివరించబడింది

## స్వాత్త్వికజ్ఞానము

ఈశ్వరుడు, హిరణ్యగర్భుడు, విరాట్టు మొ॥న వారిలోనూ; మానవ, పశు పక్ష్యాది వివిధ ప్రాణులలోనూ; అవ్యయుడు, నాశము లేనివాడు, అవిభక్తుడు, భేదరహితుడు, ఏకస్వరూపుడు, అద్వితీయుడు, పరమార్థస్వరూపుడు, స్వయంప్రకాశుడు, అనందఘనుడు అయిన ఆత్మ వేదాంతవాక్య విచారముచేత అంతఃకరణవృత్తి విశేషమైన సాక్షాత్కారము ద్వారా గోచరిస్తుంది. నిరోధ సమాధి ద్వారా త్వంపదలక్ష్యము, తత్పదలక్ష్యము అయిన శుద్ధ్యతత్త్వము సాక్షాత్కరించగానే ఈ రెండిటి ఐక్యాన్ని గోచరింపజేసే 'తత్త్వమసి' వేదాంతవాక్య విచారము చేత జన్మించిన నిర్వికల్ప సాక్షాత్కార రూపమైన బ్రహ్మవిద్య అనే వృత్తి ఎప్పుడు కలుగుతుందో అప్పుడు ఆవరణ భంగము ద్వారా మూలమైన అవిద్యానివృత్తి జరిగి బ్రహ్మసుఖ సాక్షాత్కార రూపమైన అనుభవం కలుగుతుంది. అదే సాత్త్విక జ్ఞానము.

## రాజస జ్ఞానము

భేదముతో ప్రతీతములైన ప్రాణలన్నింటిలోనూ సుఖదుఃఖాల తారతమ్యముచేత ప్రతి శరీరంలోనూ పరస్పరమైన విలక్షణం కలిగిన ఆత్మబుద్ధిని కలిగింపజేయు జ్ఞానము రాజసజ్ఞానము.

## తామస జ్ఞానము

నిస్సంగుడు, కూటస్థుడు అయిన ఆత్మను వికారమైనవాడని తలచడము, అనాత్మవస్తువు (తాను కాని వస్తువు – ఆత్మ కాని విషయము) పట్ల ఆత్మబుద్ధిని (తానే అని భ్రమించడం) పొందడం తామస జ్ఞానమనబడుతుంది.

ఈ మూడు రకాలైన జ్ఞానాలలోనూ మనువు వివరించినది సాత్త్వికజ్ఞానము.

## శౌచమ్

**శ్లో॥ శౌచం తు ద్వివిధం ప్రోక్తం**
**బాహ్యమాభ్యంతరం తథా।**
**మృజ్జలాభ్యాం స్మృతం**
**బాహ్యం మనశ్శుద్ధిరాభ్యంతరం॥**

భావం: శౌచము రెండు రకాలు – బాహ్యము, అభ్యంతరము. మట్టి, నీరు మొ॥న వాటితో చేయబడే శౌచము బాహ్యశౌచము. మనశ్శౌచము ఆంతరిక శౌచము.

## అంతః శౌచమ్

అంతఃశౌచాన్ని యోగసూత్రాలు యిలా వివరించాయి:–

**మైత్రీ కరుణాముదితా ఉపేక్షాణాం సుఖదుఃఖ**
**పుణ్యాపుణ్య విషయాణాం భావనాతః చిత్తప్రసాదనమ్॥**

భావం: సుఖంగా వున్నవారితో స్నేహము, బాధలో వున్న వారి పట్ల దయ, పుణ్యాలను చేసేవాడిని మెచ్చుకోవడం, పాపాలు చేసేవాడికి దూరంగా వుండడం – వీటివలన చిత్తశుద్ధి కలుగుతుంది.

సుఖంగా వున్న స్నేహితుల విషయంలో 'మన స్నేహితులందరూ సుఖంగా వున్నారు. ఇది చాలా బాగా వుంది" అని భావించాలి. ఈర్ష్య కలిగి వుండకూడదు. దుఃఖముతో వున్నప్రాణులన్నింటిపట్ల, "ఈ అందరి దుఃఖము ఎలా నివృత్తి చెందుతుంది?" అని కృప కలిగివుండాలి. వారిపట్ల ఉపేక్ష కాని, వారు కష్టపడుతున్నందువలన సంతోషించడంగాని చేయకూడదు. పుణ్యాత్ములైనవారు

కనిపిస్తే వారి పుణ్యకార్యాలను ప్రోత్సహించి సంతోషాన్ని ప్రకటించాలి. అసూయ గాని, ఉపేక్షగాని వుండకూడదు. పాపాత్ములకు దూరంగా వుండాలి. వారి పట్ల ఉదాసీనంగా వుండాలి. వారు చేసే పనులను ఆమోదించకూడదు. కానీ ద్వేషము కూడా కలిగి వుండకూడదు.

1) మైత్రి వలన రాగము, ద్వేషము, ఈర్ష్య మొదలైనవి నివృత్తి పొందుతాయి.

2) కరుణ వలన ద్వేషము, గర్వము నివృత్తి చెందుతాయి.

3) మోదభావము (సంతోషము) వలన పుణ్యము చేయకపోవడం వలన కలిగే బాధ నివృత్తి పొందుతుంది.

4) ఉపేక్షా భావము చేత పూర్వము చేసిన పాపకర్మ చేత కలిగిన బాధ నివృత్తి పొందుతుంది.

ప్రపంచంలో ఎక్కువమంది మనుష్యుల అంతఃకరణం రాగద్వేషాలచేతనో, పుణ్యాలు చేయలేదనో, పాపాలు చేశామనో మాలిన్యాన్ని పొందివుంటుంది. ఏ సుఖంలో మోహము కలుగుతుందో, ఆ సుఖమును అనుభవించిన తరువాత రజోగుణం వలన కలిగిన 'ఇలాంటి సుఖము ఎల్లప్పుడూ లభించాలనే బుద్ధివృత్తి రాగము. ఆ కోరిక దృష్ట (కనిపించేవి), అదృష్ట (కనిపించనిని) అయిన సామగ్రులు లేనిదే కలుగదు. కాబట్టి రాగము ఎల్లప్పుడూ చిత్తాన్ని మలినపరుస్తూనే వుంటుంది. 'ఈ సుఖంగా వున్న వారందరూ నా స్నేహితులే' అనే భావన కలిగిన వెంటనే వారి సుఖము తన సుఖమే అవుతుంది. తండ్రి రాజ్యమునుండి నివృత్తిని చెందినప్పుడు రాజ్యము కుమారుడికి చెందుతుంది. 'కుమారుడి రాజ్యము తన రాజ్యమే కదా!' ఈ భావము కలిగిన వెంటనే తండ్రికి కుమారుడి రాజ్యము పట్ల రాగం కలుగదు. కుమారుడు రాజ్యం చేస్తుండడం వలన అతనికి అసూయా ద్వేషాలు కలుగవు. అలాగే 'ఇతరులు సుఖము తన సుఖమే!' అనే భావన కలిగివుంటే సుఖము కోరేవాడి పట్ల రాగము వుండదు. సుఖము అనుభవించేవారి పట్ల అసూయా ద్వేషాలు కలుగవు. ఈ విధంగా మైత్రీభావము చేత ఈర్ష్యాద్వేషాలు, అసూయ మొ॥నవి నివృత్తిని పొందడం వలన వర్షఋుతువు పోయిన తరువాత నీరు నిర్మలమైనట్లు చిత్తము నిర్మలమవుతుంది.

దుఃఖము వలన ద్వేషము కలుగుతుంది. ద్వేషము తమోగుణ, రజోగుణ పరిణామవిశేషమగు ఒకానొక బుద్ధివృత్తి. 'దుఃఖము నాకు కలుగకూడదు' అనేది ద్వేషస్వరూపము. ఆ ద్వేషానికి కారణరూపమైన దుఃఖము పులులు మొ॥న శత్రువులు ఎన్నో వుండడం చేత పోదు. కాబట్టి ఈ ద్వేషము మానవ హృదయాన్ని ఎప్పుడూ తినేస్తూ వుంటుంది.

తనకు దుఃఖము కలగడం ఎలా ఇష్టముండదో, అలానే ఇతరులకు కూడా దుఃఖము కలుగకూడదనే భావంతో బాధలో నున్నవారి పట్ల కరుణ కలిగి వున్నప్పుడు శత్రువుల నుండి ద్వేషము నివృత్తి చెంది చిత్తము ప్రసన్నతను పొందుతుంది. అలానే కరుణాభావముచేత, 'నేను సుఖముగా వున్నాను' అనే గర్వం కూడా కలుగదు. మానవుడు స్వభావసిద్ధంగా పుణ్యాన్ని అనుష్ఠించనివాడుగాను, పాపాలను నిరంతరం చేసేవాడుగానూ వుంటాడు. ఇందువలన ఇతరులు సుఖపడుతూ వుంటే మానవుడికి పశ్చాత్తాపము కలుగుతుంది. 'నేను ఇటువంటి సుఖాలనిచ్చే పుణ్యకర్మలను ఎందుకు చేయలేకపోయాను?' అని అనిపిస్తుంది. అలానే దుఃఖాన్ని (కష్టాన్ని) అనుభవించే సమయంలో 'ఈ దుఃఖం కలగడానికి కారణమైన చెడ్డపనిని ఎలా చేయగలిగాను?' అని పశ్చాత్తాపము కలుగుతుంది. పుణ్యాత్ముల పట్ల మోదాన్ని (సంతోషాన్ని) అనుభవించినప్పుడు పుణ్యకర్మవాసన చేత ఆ మహాత్ముల పుణ్యభావాలు తనలోనే కలుగుతాయి. అలా ఉత్తమమైన పుణ్యావస్థలో ప్రవర్తించినవారికి పుణ్యము చేయలేకపోయినందువలన బాధపడనవసరం వుండదు.

పాపము చేసేవారి పట్ల ఉపేక్షాభావం కలిగివుంటే ఉదాసీనత పెరిగి తన పాపాచరణ పట్ల కూడా ఉదాసీనత ఏర్పడుతుంది. పాపము నుండి నివృత్తి పొందడం చేత పాపకార్యాలను చేయడం వలన అనుభవించవలసిన బాధను అనుభవించాల్సిన పనిలేదు. ఇలా మైత్రీ భావం వలన అంతఃకరణ నుండి రాగద్వేషాలు నివృత్తిని పొంది చిత్తం నిర్మలమవుతుంది.

**- సశేషం**

(సెప్టెంబరు సంచిక తరువాయి)

# బుద్ధ ధ్యాన హృదయము

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

## అధ్యాయం - 5

### శిక్షణాక్రమము

ఎప్పుడైనా యీ కదలిక నిలిచిపోయినా, అస్పష్టమైనా దానిని గుర్తించడానికి శ్రమ పడకూడదు. కూర్చునుట అనే శారీరక వైఖరి మీదికి, స్పర్శ అనుభవం పైకి దృష్టిని మరలించాలి. దీనికి ఒక పద్ధతి వున్నది. శరీరంలో ఆరు, ఏడు చోట్ల కలిగే స్పర్శానుభూతినెన్నుకొని ఒకదాని నుండి మరొకదానికి ఆ క్రమంలో యెరుకను సాగించాలి. ఒక వరుస పూర్తికాగానే, కూర్చునుట అను భంగిమను మొత్తాన్ని గుర్తించి తిరిగి మళ్ళీ అదేక్రమంలో అవే స్థానాలగుండా స్మృతిని కొనసాగించాలి. ఇక్కడి స్పర్శ – ఇక్కడి స్పర్శ – ఇక్కడి స్పర్శ – కూర్చునుట అని యిందులో ఒక్కొక్క అనుభవం పైన రెండుమాత్రల కాలం నిలిపితే చాలు. మాత్ర అంటే ఒక్క పదాన్ని వుచ్చరించే సమయం. అంత సమయం ఆయా కేంద్రాల మీద దృష్టిని నిలపడం అభ్యాసంకాగానే అక్షరాల నుచ్చరించే సమయం అనే కొలతను విడిచిపెట్టాలి. ఇక్కడ గుర్తించవలసినదేమంటే స్మృతి యొక్క లక్ష్యం "యిక్కడి స్పర్శ, కూర్చునుట" అనే పదాలు కాదని, ఆ స్పర్శను కలిగించే స్థలాలు కావని అక్కడ కలిగే అనుభవం మాత్రమేనని. ఒక్కొక్కసారి శరీరంలోని కొన్నేసి స్థలాలను ఎన్నుకోవచ్చు.

కడుపుయొక్క కదలికలనుండి స్మృతి తొలగినప్పుడు ఆ మధ్యకాలంలో దానికి ఆలంబనంగా మాత్రమే యీ కూర్చునుటను వాడుకోవాలి. ఇవి స్మృతి యొక్క వుపలక్ష్యం మాత్రమే.



ఇలా స్పర్శ, కూర్చునుట అనే వాటిని గుర్తిస్తుండగ మనస్సు తనంతటతాను కడుపుయొక్క కదలికల పైకి మళ్ళినప్పుడు తిరిగి ఆ కడుపుయొక్క కదలికలను వీలైనంత గుర్తించడానికే స్మృతిని కొనసాగించాలి.

- సశేషం

(సెప్టెంబరు సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

*శ్రీమతి శ్రీదేవి*

## అధ్యాయం - 6

## *సాయినాథుని చల్లని ఒడిలో*

నైమిశారణ్యం (ఉ॥ప్ర॥)లో శ్రీ ఆనందమయి మాత నిర్వహించిన భాగవత సప్తాహానికి వెళ్ళాను. అక్కడ శ్రీ అఖండానంద సరస్వతి అనే మహనీయులు భాగవత ప్రవచనము, నిత్య సద్గోష్ఠి చేశారు. ఆయన తమ ప్రవచనంలో సిద్ధ పురుషుడు మాత్రమే ఆత్మజ్ఞానం ప్రసాదించగలరని, సమాధి చెందినవారు కష్టాలు, కోర్కెలు మాత్రమే తీర్చగలరనీ చెప్పారు. అలా అయితే శ్రీ సాయి నన్నెలా ఉద్ధరించగలరు? అలా అని వేరొకరిని ఆశ్రయిద్దామా అంటే, శిరిడీలో నాకు కలిగిన అనుభవం వంటిది నాకెవరి వద్దా కలుగలేదు. అందుకు తగిన దివ్యసందేశమేమీ నాకు రాలేదు. కనుక నాకు కర్తవ్యం బోధించమని శ్రీ సాయినే ప్రార్థించాను. ఒకనాడు నా పాత విద్యార్థి విద్యానగర్ వచ్చి, నేను యీసారి శిరిడీ వచ్చినప్పుడు పూనాలో తన యింటికి రావాలని కోరాడు. కేవలం మొహమాటానికి మాత్రమే సరేనన్నాను. తర్వాత శిరిడీ వెళ్ళినప్పుడు రెండవరోజు నుండీ అతనిని చూడాలని బలంగా అనిపించి పూనా వెళ్ళాను. అప్పటికే అతడు ఆఫీసుకు వెళ్ళడం వలన, సాయంత్రంలోగా వూరు చూచి వద్దామని బయలుదేరాను. ఇంతలో అక్కడ శ్రీ గుళవణి మహరాజ్ అనే యోగి వున్నారని తెలిసి వారిని దర్శించాను. ఆ వృద్ధుడు నన్ను చూసి, "ఓ సాయిబాబా కా బేటా!" అని పలుకరించారు. తర్వాత నా సందేహము విని, "శ్రీ సాయి విషయంలో అట్టి శంక అవసరం లేదు. ఆయన సాక్షాత్తు దత్తాత్రేయుని అవతారం. మహాసమాధి చెందాక కూడా ఎందరికో సశరీరంగా దర్శనమిచ్చి ఉద్ధరిస్తున్నారు. నీవు నడుస్తున్న బాట మంచిదే. ఆ మార్గాన్నే సాగిపో!" అన్నారు. శ్రీ సాయి కుశాభావు చేత 'శ్రీ గురుచరిత్ర' 108సార్లు పారాయణ చేయించారని తెలిసాక ఆ గ్రంథం చదవాలనిపించింది. కాని నాకు మరాఠీ రాదని వారితో చెప్పాను. ఆయన సంతోషించి, వారి గురువైన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి సంస్కృతంలోనికి అనువదించిన 'శ్రీ గురుచరిత్ర' (సమశ్లోకి), 'శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి' (సంక్షిప్త శ్రీ గురుచరిత్ర), 'శ్రీ దత్త భజనలు' అనే గ్రంథాలు నాకు ప్రసాదంగా యిచ్చి ఆశీర్వదించారు.

నా ధ్యానంలోనూ, సాధనలోనూ సవరణలు ఏమైనా చెప్పమని వారిని కోరాను. ఆయన అప్పుడు పూనాలో శ్రీ ఆనందమయి మాత వున్నారని, వారి సన్నిధిలో ఒక గంట ధ్యానం చేసుకుంటే లోపాలన్నీ వాటికవే చక్కబడతాయనీ చెప్పారు. బాబా అనుగ్రహంతో అట్టి

అవకాశము కూడా లభించింది. నేను తిరిగి శిరిడీ చేరి, అక్కడ సప్తాహ పారాయణ పూర్తి చేసుకొని ఆయన యిచ్చిన గ్రంథాలు చదివాను. 'శ్రీ గురుచరిత్ర పారాయణ పూర్తి అయిన రాత్రి కలలో శ్రీ సాయి నాకు దర్శనమిచ్చి, నేను పాదాభివందనము చేయగానే నన్ను కౌగలించుకొని వీపు, తల నిమురుతూ, "నీకు గురువు దొరకలేదని బాధపడతావెందుకు? నేనున్నాను!" అని ముమ్మారు చెప్పారు.

నా సమస్యకు అలా పరిష్కారం చూపారు సాయి. ఏ క్షేత్రంలో మన పురాణా లెన్నింటినో సూత మహర్షి నుండి ఎందరో ఋషులు శ్రవణం చేసారో, అట్టి నైమిశారణ్యంలో, శ్రీ ఆనందమయి వంటి బ్రహ్మజ్ఞాని సన్నిధిలో, భాగవత పారాయణ ద్వారా శ్రీ కృష్ణ సాక్షాత్కారం పొందిన శ్రీ అఖండానంద సరస్వతి చెప్పిన దానితో ఆధ్యాత్మిక జీవితానికి మూలమైన ప్రశ్న నాలో రేపి, తిరిగి కొన్ని సంవత్సరాల తర్వాత నన్ను శిరిడీ నుండి పూనా పంపి శ్రీ గుళవణి మహరాజ్, శ్రీ ఆనందమయి మాతల దర్శనమును 'శ్రీ గురుచరిత్ర' ను ప్రసాదించి సాయి నన్ననుగ్రహించారు. దానిని పారాయణ చేసాకగాని, శ్రీ సాయి నన్ను తనవాడుగా చేసుకోలేదు. మన పూర్వజన్మ సంస్కారానికి తగిన పూర్ణుడైన గురువెవరో మనకు తెల్పడానికిగాని, వారి అనుగ్రహానికి పాత్రులుగా మనలను తీర్చిదిద్దడానికి గాని 'శ్రీ గురుచరిత్ర' ఎంత విలువయినదో అర్థమయింది. కానీ దాని పారాయణ సులభంగా సఫలమయ్యేందుకు శ్రీ సాయిచరిత్ర గూడ అంతే అవసరమని నా అనుభవంలో గుర్తించాను. 'శ్రీ గురుచరిత్ర'లో నామధారకుడనే భక్తుడు సద్గురుని లీలలు విని ఆయన అనుగ్రహం కోసం తపిస్తుంటే అతనికి స్వప్నంలో ఆయన దర్శనమిచ్చారు. అతడు నిద్ర లేచాక సరిగా ఆ రూపంలోనే సిద్ధయోగి అనే అవధూత దర్శనమిచ్చి 'శ్రీ గురుచరిత్ర' వినిపించి కృతార్థుణ్ణి చేశారు. దానిని ప్రపంచానికి అందించమని ఆదేశించారు కూడా.




శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు చెప్పినట్లు మనం అజ్ఞులం కనుక గురువు విషయంలో గూడ మన నిర్ణయం లోపభూయిష్టంగానే వుంటుంది. కనుక మనంగా గురువును నిర్ణయించుకుంటే జ్ఞానం లేనివారినే ఎన్నుకుంటాము. పూర్వపుణ్యం వలన మహాత్ముల దర్శనమైనా వారిని గురువుగా ఆశ్రయించలేకపోతాము. ఆయన మన పూర్వజన్మ సంస్కారానికి సరిపోయిన వారవ్వాలి గదా! ఆయన చూపే మార్గం మన సంస్కారానికి సరిపోవాలి. ఇవన్నీ సమకూడినా, వారి అనుగ్రహం పొందగల్గాలంటే వారినెలా సేవించాలో, ఆశ్రయించాలో తెలియాలి. అందుకెంతో హృదయ పరిపాకం కావాలి. కనుక యీ కలియుగంలో గురువును మనకై మనమే ఎన్నుకొనక, 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేస్తే తగిన సంస్కారం ఏర్పడుతుంది. అప్పుడు భగవంతుడే మన

సంస్కారానికి సరిపడిన సద్గురువును చూపుతారు. ఈ మార్గంలో శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి వంటి వారెందరో పూర్ణపురుషులయ్యారు. 'శ్రీ గురుచరిత్ర' గూడ యిందుకు వుపకరిస్తుందని యీ గ్రంథంలో ఒకరి అనుభవం తెల్పుతుంది.

అంతేకాదు, 'శ్రీగురుచరిత్ర' లో నామధారకునిలా సమాధి చెందిన పూర్ణపురుషుని ఆశ్రయించి, వారి అనుగ్రహంతో 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయడం సిసలైన పద్ధతి. ఇస్లాములోని సూఫీ సాంప్రదాయంగూడ యిలానే చెబుతుంది. ఏనాడో అంతర్థానమైన రెండవ దత్తావతారమైన శ్రీ గురుని ఆశ్రయించుకొని 'శ్రీ గురుచరిత్ర' పారాయణ ద్వారా భగవంతుని ఆదేశం పొందాకనే ఆయన చూపిన సద్గురువును ఆశ్రయించడమొక్కటే ఈ కాలంలో భద్రమైన మార్గం. మనమీనాడు పూర్ణ దత్తావతారమైన శ్రీ సాయిబాబాను ఆశ్రయించి ఆయన చరిత్ర పారాయణ చేశాక 'శ్రీ గురుచరిత్ర' గూడ పారాయణ చేస్తుండడం ఎంతో శ్రేయస్కరం. సాయిబాబా సూక్ష్మంగా మాత్రమే చెప్పిన ఎన్నో అంశాలకు వివరణ 'శ్రీ గురుచరిత్ర' లోనూ, శ్రీ గురుచరిత్రలో మనకు పూర్తిగా అర్థంకాని అంశాలకు వివరణ యీ 'శ్రీ సాయిలీలామృతము' (శ్రీసాయిబాబా జీవిత చరిత్ర) లోనూ లభిస్తాయి. జాగ్రత్తగా చదివితే 'శ్రీ సాయి ప్రబోధామృతము', 'శ్రీ సాయిసన్నిధి' అనే గ్రంథాలలో యీ రెండింటికీ గల సమన్వయం భక్తుల అనుభవాలలోను, సాయి చేసిన బోధలలోనూ మనకు ఆచరణ యోగ్యం లభిస్తుంది. ఇవి నేను వ్రాసినవి గనుక యిలా అనడం లేదు. శ్రీసాయి చరిత్రను, బోధలనూ ఆయన చెప్పిన రీతిన అధ్యయనం చేస్తే ఆయన చెప్పిన ప్రకారం లభించిన వెలలేని ఆణిముత్యాలను వారి ఆదేశం మేరకు మీతో పంచుకొంటున్నాను".

గురుసమాగమం, గుర్వనుగ్రహం శ్రీ భరద్వాజగారికి ఏ విధంగా ప్రాప్తించాయో వారి మాటలలోనే తెలుసుకొన్నాము. శ్రీ సాయినాథుని సన్నిధిలో ఆరుగంటల పాటు గాఢ సమాధిమగ్నులై, అటు



పిమ్మట 'భగవంతుడున్నాడా, లేడా?' అన్న సంశయం రూపుమాసిపోగా, తమ స్వయంకృషితో దేనినైతే పొందాలని అనుకున్నారో ఆ విశ్వ చైతన్యానుభూతిని తమ దర్శనమాత్రం చేతనే అనుగ్రహించి తామే ఆయన గురువునని స్వప్నంలో వెన్నుతట్టి చెప్పిన అపార కరుణామయుడు శ్రీ సాయినాథుని మ్రోల తమ యావజ్జీవితాన్నీ పూజాపుష్పంగా సమర్పించుకొని ధన్యులయ్యారు శ్రీ భరద్వాజగారు. అనంతరం ఆయన ఆ సమర్థ సద్గురుడైన సాయినాథుని ప్రతినిధిగా సకల జనావళినీ ఆ మహాత్ముని చల్లని నీడను చేర్చే మహాయజ్ఞంలో తమ తను, మనో, ధనాలనర్పించి కాలాంతరంలో అసంఖ్యాక ప్రజల్ని సాయిపథగాముల్ని చేసి, తాము చేపట్టిన ఆ గురుతరమైన బాధ్యతా నిర్వహణలో కృతకృత్యులైనారు.

**- సశేషం**

(సెప్టెంబరు సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

### శ్రీశ్రీ ఆనందమయి మాత విరచిత భక్తి గీతము

జీవేర భాగే అవైరాగ్యే
పరమపద మిలచే నారే,
(తాయీ) కరోసార యేక వైరాగ్య
వివేక పరిహర వాసనారే॥

వైరాగ్యేర మాత్రాకత,
భుజబి కాజే హతే రత,
తస్పనదే ఖూచి అవిరత,
కోనూదికే తోరమన్ టావేరే ॥

సలవే తారే సబ్ కర్మ,
ఆచర మానవధర్మ,
(తుమ్) నిత్య నిర్వికార (బ్రహ్మ)
చింత చిత్తే బారే బారే ॥

బాహిర హోతే డాకే మన్,
హృదే రాఖ అనుక్షణ
(కరి) బ్రహ్మ ఖేలాయ ఆరోహణ,
తరహ భవ సాగరే ॥

హోలే అహంకార హత
సబ్ ద్వంద్వనివారిత,
దేఖబి స్వభాహ హవేస్తత,
జ్ఞేయ సత్య పరాత్పరే ॥

శ్రీ ఆనందమయి మాత యెందరినో ఆధ్యాత్మిక మార్గంలో నడిపించారు. అటువంటి వారిలో వింధ్యాచల నివాసి అయిన మహేశచంద్ర భట్టాచార్య అనే భక్తుడు ఒకడు. అతడు అమ్మ యెక్కడవున్నా తరచూ అమ్మను దర్శిస్తూ వుండేవాడు. అతడు వింధ్యాచలంలో ఆనందమయి అమ్మ ఆశ్రమానికి సమీపంలోనే ఒక యింటిని నిర్మించుకొని వుండసాగాడు. అమ్మ అతని సాధనకు సంబంధించి ఒక నియమాన్ని విధించారు. అతనితో అతడు క్రొత్తగా నిర్మించుకొన్న యింటి ప్రాంగణంలో ఒక పంచవటిని స్థాపించి, ప్రతిరోజూ ఆ పంచవటి వద్ద కొంతసేపు కూర్చుని సాధన చేయవలసిందిగా అమ్మ ఆదేశించారు. అతడు ఆ ఆదేశాన్ని పాటించాడు. అమ్మనే తన గురువుగా విశ్వసించి, ఆరాధించి అమ్మ అనుగ్రహాన్ని పొందాడు.

విరాజమోహన దీదీ అనే ఒక వితంతువు అయిన స్త్రీ తరచూ అమ్మను దర్శిస్తూ యెక్కువ రోజులు అమ్మ సన్నిధిలోనే గడుపుతూ వుండేది. ఆమె గొప్ప భగవచ్చింతనా తత్పరురాలు. అమ్మ ఆమెకు సాధనలో మార్గనిర్దేశం చేస్తూ ఆమెకు యెంతో ఆధ్యాత్మిక వున్నతిని ప్రసాదించారు. కొంతకాలానికి ఆమెకు కాషాయ వస్త్రాలు ధరింపజేసి ఆమెను పూర్తిగా ఆశ్రమవాసినిగా చేశారు అమ్మ.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీ ఎస్.వి.సుబ్బయ్య, బెంగుళూరు

మేము 2000 సంవత్సరం నుంచి గుత్తి సత్సంగ సభ్యులం. ప్రతిరోజు సాయంత్రం భజన చేయడం, శ్రీ సాయిలీలామృతము పారాయణ చేయడం జరిగేది.

1995లో సాంకేతికవిద్య(పాలిటెక్నిక్) మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాను. కానీ సర్టిఫికెట్ (ధ్రువీకరణ పత్రం) తెచ్చుకోవడానికి ఆర్థిక సమస్యల వల్ల ఐదు సంవత్సరాలు పట్టింది. ఈలోపు గుత్తి లోనే ఒక ట్యుటోరియల్ లో రాత్రివేళ పాఠాలు చెప్పేవాడిని. ఒక కంపెనీలో పగటిపూట పనిచేసేవాడిని. ఉదయం 7గంటల నుంచి 9వరకు ట్యుటోరియల్, అక్కడనించి కంపెనీ ఉద్యోగం, తిరిగి సాయంత్రం 5 నుంచి 10 వరకు ట్యుటోరియల్ కి వెళ్ళేవాడిని. రెండు చోట్ల ఉద్యోగాలు చేసినా జీతం తక్కువగా ఉండటంవల్ల, అప్పుడు ఇంట్లో ఆర్థిక సమస్యలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల, సంపాదన సరిపోయేది కాదు. ట్యుటోరియల్ లో వచ్చిన సంపాదనలో చాలావరకు బాగా చదువుకొనేపిల్లలకి, ఫీజులు కట్టుకోలేని వారికి ఖర్చుపెట్టేవాడిని.

ఇలా 3 సంవత్సరములు గడిచాక ఒకసారి మా అమ్మ రెండువేల రూపాయలు ఇచ్చి సర్టిఫికేట్ తెచ్చుకొమ్మని చెప్పింది. నేను చదివేటప్పుడు, గ్రంథాలయంలో పుస్తకాలు తీసుకుంటే అవి తిరిగి ఇచ్చేటప్పుడు కనిపించలేదు, ఆ డబ్బులు కట్టాలి, అవే చాలా ఖరీదు ఉంటాయి. ఇంకా వసతి గృహంలో చదువుకునేవాడిని. దానికి సంబంధించిన డబ్బుకూడా బకాయి ఉంది. ఇవన్నీ కడితేనే కానీ సర్టిఫికెట్ ఇవ్వరు. ఆ సర్టిఫికెట్ తీసుకోకపోతే మంచి ఉద్యోగాలు రావు. నా దగ్గరున్న డబ్బు చాలా తక్కువ. బాకీలు చెల్లించడానికి సరిపోదు.

మేమున్న ఊరు నించి బస్సు ఎక్కితే పావుగంటలో మదనపల్లి కాలేజీకి చేరవచ్చు. బాబాని ప్రార్థిస్తూ కాలినడకన వెడితే ఆయన దయవల్ల వాళ్ళు సర్టిఫికెట్ ఇస్తారని ఆశతో, కొంత దూరం నడవడం, కాస్సేపు ఒకచోట కూర్చుని పారాయణ చెయ్యడం, సహాయం చెయ్యమని బాబాని అర్థించడం, కన్నీళ్ళతో ప్రార్థించడం, ఇవన్నీ చేస్తూ మొత్తానికి మదనపల్లె చేరాను. మొదట గ్రంథాలయానికి వెళ్ళి, దానికి సంబంధించిన అధికారితో నా బాకీ సంగతి చెప్తుంటేనే, "సుబ్బయ్యగారు మూడు వందలు కట్టండి" అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. నేను పోగొట్టినవి చాలా ఖరీదైన పుస్తకాలు. నేను మళ్ళీ ఏదో చెప్తుంటే, ఆయన వినిపించుకోకుండా "అంతే కట్టండి" అన్నారు. అలాగే హాస్టలు రుసుము, అన్నీ కలిపి 1200 రూపాయలు అయ్యింది. ఇంకా నాకే డబ్బులు మిగిలాయి.

సాయినాథుని కరుణకు ఆనందాశ్చర్యాలతో నా కళ్ళు వర్షించాయి.


తరవాత రైల్వేలో పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొంది, 2001 లో రైల్వే లో పైలెట్ గా నియమించబడ్డాను. నిజానికి నన్ను ఏ రాష్ట్రంలోనైనా ఉద్యోగానికి నియమించవచ్చు. కానీ త్రివేండ్రంలో పోస్టింగ్ వేశారు. తరువాత బెంగుళూరులో స్థిరపడ్డాను. స్వగ్రామం కడప. నేను ఉద్యోగం చేసే చోటుకి నా స్వంత ఊరు నాలుగున్నర గంటల దూరం. ఏ ఉత్తరం వైపో నియామకం ఇవ్వకుండా ఇంటిదగ్గరగా ఇవ్వడం కూడా పూర్తిగా బాబా దయ.

ఒకసారి విద్యానగర్, గొలగమూడి, ఒంగోలు వెడదామని 5రోజులు సెలవు మీద బయలుదేరాను. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బస్సులో ఏదో సమస్య వచ్చి ఆగిపోయింది. నాకు అజీర్ణం సమస్య వచ్చి, కడుపులో తిప్పినట్లయ్యి, బస్సు దిగాను. నేను దిగిన వెంటనే బస్సు బయలుదేరింది. నేనొక్కడినే బస్సు దిగాను. అక్కడ మనుష్య సంచారంలేదు. చీకటిగా ఉంది. సాయినాథుని తలచుకుంటూ వేగంగా నడుస్తున్నాను. మొబైల్ ఒక్కటే నా దగ్గర ఉంది. నా సంచీ బస్సులో ఉండిపోయింది. బాబా, మాస్టరుగారు ఇలా అడవిలో వుంచేసారేమిటి అని బాధపడుతూ కొంతదూరం నడిచేసరికి, ఒక సెక్యూరిటీ గార్డు కనిపించాడు. అతనికి నా గోడు వెళ్ళబోసుకుంటే, నేను ఎక్కిన బస్సు కి ఫోను చేసి, తరువాతి టోల్ గేటు దగ్గర ఆగమని, నన్ను అటువైపు వెడుతున్న లారీ ఎక్కించి, ఆ బస్సు అందుకునేట్టు చేశాడు. నా దృష్టిలో అతను సాక్షాత్తు సాయినాథుడే! లేకుంటే ఆ అర్ధరాత్రి ఒంటరిగా ఉండటంవల్ల చేయవలసిన కర్తవ్యం కూడా తోచలేదు. అందుకే ఆ వ్యక్తి రూపంలో బాబానే నన్ను అనుగ్రహించారు.

మొదటగా నన్ను సహాయ పైలెట్ గా నియామకం చేశారు. అప్పట్లో జనవరి నుండి ఫిబ్రవరి వరకు సాయిమాస్టర్ మాల వేసుకునేవాళ్ళం. మాల ధారణ మొదటిరోజే మా ప్రధాన పైలెట్ నేనూ రైలు నడుపుతూవుంటే, ఒక 25 సంవత్సరముల వయసున్న అమ్మాయి, కొంతదూరంలో పట్టాల పైన తల పెట్టి పడుకుని ఉంది. చాలా తక్కువ సమయంలో ఆకస్మికంగా రైలు ఆపి, "సుబ్బయ్యా, రైలు దిగి, అక్కడి పరిస్థితి చూసి చెప్పు" అన్నాడు. ఆ అమ్మాయి ఖచ్చితంగా చనిపోయే వుంటుందనుకున్నాను. ఎందుకంటే చాలా దగ్గరకు వచ్చాక రైలు ఆగడం జరిగింది. బాబా ఈ ఘోరం నేను ఇప్పుడు ఎలా చూడాలి, అక్కడ ఏదైనా జరిగితే పెద్ద హడావిడి ఉంటుంది. పైగా ఈరోజే మాల వేసుకున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు, మీరు నన్ను ఈవిధంగా అనుగ్రహించారా అనుకుంటూ, భయం భయంగా క్రిందకి దిగాను. ఇలా రైలు దిగానో లేదో ఆ అమ్మాయి రైలు కిందనుంచి పాకుతూ బయటికి వచ్చింది.

ఆమెను చూసి నేను ఆశ్చర్య పోయాను. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్రతికే అవకాశం లేదు. ఎందుకంటే చాలా దగ్గరగా వచ్చాక ఆకస్మికంగా రైలు ఆపిన పరిస్థితి. వెంటనే సాయినాథా అని గట్టిగా స్మరించి దణ్ణం పెట్టుకున్నాను.,,,,,ఇలా ఎన్నోసార్లు నన్ను కాపాడి ఒడ్డున వేశారు.

తను మన ధనాలతో వారిని సేవించేలా అనుగ్రహించి, ఇలా ఎల్లప్పుడూ విడవకుండా నాచేయి పట్టుకుని నడిపించమని ప్రార్థన!! ●



# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ అబ్దుల్ అమీన్**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యులైన శ్రీ అబ్దుల్ అమీన్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను జన్మతః ముస్లిమునైనా అన్ని మతాలను గౌరవిస్తాను. మా సాంప్రదాయం ప్రకారం నేను నమాజ్ చేసినప్పటికీ ఆదివారాలు చర్చికి కూడా వెళ్ళేవాడిని. మా తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగుండేది కాదు. వారికి ఆరోగ్యం చేకూర్చమని అందరి దేవుళ్ళకు మొక్కేవాడిని. కానీ వారిద్దరూ మరణించారు. దానితో నాకు భగవంతుడి మీద విశ్వాసం పోయింది. చాలా నిరాశపడ్డాను. అప్పటికి నాకు వివాహం కూడా కాలేదు. ఆ కష్టపరిస్థితిలో నా స్నేహితుడి ప్రోద్బలంతో బాబా మందిరానికి వచ్చి కూర్చునేవాడిని. అక్కడ ఏదైనా పని వుంటే చేసేవాడిని.

నా స్నేహితుడు నన్ను 'శ్రీగురుచరిత్ర' చదవమని మరీ మరీ చెబుతుండడంతో ఆ గ్రంథం గొప్పదో కాదో తెలుసుకోడానికి ఒక సంకల్పం చెప్పుకుని పారాయణ మొదలుపెట్టాను. ఆ సంకల్పం నెరవేరితే ఆ గ్రంథం గొప్పదని నమ్ముదామనుకున్నాను. ఏదైనా పని జరగాలనుకుని సంకల్పం చెప్పుకుంటే అది నెరవేరాక ఆ గ్రంథం చదవకపోయినా జరిగేదేమో అని మరలా సందేహం రావచ్చు. 'దత్తస్వామి స్వప్నదర్శనమివ్వాలి' అనుకుంటే, వారు దర్శనం ఇచ్చాక ఎప్పుడూ అదే ఆలోచనతో వుండడం వల్ల దర్శనం అయిందేమో అనిపించవచ్చు. కనుక ఈ రెండూ కాకుండా, 'నాకు భగవంతుడు వున్నాడన్న విశ్వాసం కలగాలి' అని సంకల్పం చెప్పుకున్నాను.

మొదలుపెట్టిన నాలుగవరోజునో, ఐదవరోజునో మధ్యాహ్న సమయంలో నేను మగతనిద్రలో వున్నాను. జరిగేది తెలుస్తోంది కానీ పూర్తిగా మెలకువలో లేను, అలాగని కల కూడా కాదు. కాషాయం కట్టుకున్న ఒక వ్యక్తి నన్ను రెండుచేతులు పట్టుకుని పక్కకు లాగుతున్నాడు. అతని ముఖం కనపడలేదు. నేను మళ్ళీ యథాస్థానానికి వెళ్ళిపోతున్నాను. అతను మళ్ళీ లాగుతున్నాడు. అలా మూడుసార్లు చేశాడు. అప్పటినుంచి నాకు అర్థమైనా కాకపోయినా ఏదో ఒక శక్తి అయితే వుందని బోధపడింది. అప్పటినుంచి మందిరంలో చేసే పని నెమ్మదిగా సేవగా మారింది. తరువాత 'శ్రీ సాయిలీలామృతం' గ్రంథం పారాయణ చేశాను. అప్పుడు శ్రీ సాయినాథుడు స్వప్నదర్శనమిచ్చి, ఆయన భిక్షాపాత్రనుంచి మూడు తెల్ల గోళీలు తీసి, "ఇవి నిన్ను కాపాడతాయి, జాగ్రత్తగా వుంచుకో!" అని చెప్పారు.

తరువాత బాబా దగ్గర, పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర జరిగే సేవలన్నింటిలో పాల్గొనేవాడిని. ఒకరోజు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు బృందావనం ఎదురుగా వున్న బాబా గుడి గోడదగ్గర కూర్చుని వున్నారు. నేను వెళ్ళి, "మాస్టరుగారూ! మీరు సమాధి చెందకుండా వుంటే ఎంత బాగుండేది? నా సమస్యలన్నీ ప్రత్యక్షంగా మీకు చెప్పుకునేవాడిని కదా!" అంటే పూజ్యశ్రీ మాస్టరుగారు, "నేను సమాధి చెందకపోతే నీకు ఈ అవకాశం వచ్చేది కాదురా!" అన్నారు. అప్పుడు నేను, "అటు ఆధ్యాత్మికంగాను, ఇటు లౌకికంగాను సరిగ్గా వుండలేకపోతున్నాను" అన్నాను. అది విని ఆయన సాలోచనగా ఎటో చూస్తూ నెమ్మదిగా అంతర్ధానమైపోయారు.

ఇంకొకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు వారి సమాధి మందిరంలో పక్కనే వున్న అరుగు మీద కూర్చుని, 'ఇప్పుడు ఊరికి వెళ్ళాలి కానీ తగినన్ని డబ్బులు లేవు, ఎలా?' అని ఆదుర్దా పడుతున్నారు. నేను పక్కనే వుండి ఇదంతా గమనిస్తూ, "మాస్టరుగారూ, నా దగ్గర

డబ్బులున్నాయి. వీటితో నాకు ఇప్పుడు అవసరం లేదు. మీరివి తీసుకుని ఊరికి వెళ్ళిరండి!" అని చెప్పాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు సంచిలోనుంచి బాండ్ పేపర్ తీసి వ్రాస్తున్నారు. "ఇదేంటి మాస్టరుగారూ, నేను ప్రేమగా ఇస్తే అలా బాండ్ వ్రాస్తున్నారు?" అనడిగాను. "ఒరేయ్ లెక్కంటే లెక్కేరా!" అన్నారు. తరువాత, "ఒరేయ్ ఒక పని చెప్తాను, శ్రద్ధగా చేస్తావా?" అన్నారు. "చెప్పండి మాష్టారూ!" అన్నాను. "అయితే ప్రతిరోజూ ఇక్కడ కుంకుమ సమర్పించు" అన్నారు. సరేనన్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు బస్సుస్టాండ్ వైపు వెళ్లిపోతున్నారు. బయట బాగా విసురుగా గాలి వీస్తోంది. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి వెనకాలే వెళ్లాను. అది చూసి పూజ్యశ్రీ మాస్టరుగారు, "నేను నీకొక పని అప్పగించాను. ఆ పని శ్రద్ధగా చేయి, నా వెనకాలే రాకు!" అన్నారు. సరేనని నేను వెనుతిరిగాను.

కానీ నాకు కుంకుమ ఎలా సమర్పించాలో అర్థం కాలేదు. 'ఒక పళ్లెంలో కుంకుమ వేసి అక్కడ పెడితే, నేను ఒక కొత్త సంప్రదాయం తెచ్చినట్లుంటుంది కదా! ఏమి చేయాలి?!' అనుకున్నాను. ఆరోజే ఎవరో నాకు వాట్సాప్ లో ఒక సందేశం పంపించారు. దాంట్లో ఒక విగ్రహానికి ఎవరో ఒక స్వామి బొట్టు పెడుతున్నారు.

ఆ సందేశం చూశాను కానీ వెంటనే మర్చిపోయాను.

మరునాడు సాయంత్రం నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకువచ్చేసరికివారినుదుటనబొట్టులేదు.కొంతమంది స్త్రీలు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాల దగ్గర కుంకుమను, ఒకొక్కసారి నుదుటన వున్న బొట్టుకూడా తీసుకుని పెట్టుకుంటూ వుంటారు. ఆ రోజు మొత్తానికే బొట్టు లేదు. నేను కొంచెం విసుక్కుంటూ, 'మరీ మాస్టరుగారి నుదుటన బొట్టు లేకుండా చేశారు!' అనుకుంటూ, చందనము, కుంకుమా తీసుకెళ్లి బొట్టుపెడుతూ వుంటే, ముందురోజు చూసిన వాట్సాప్ సందేశం గుర్తుకొచ్చింది. 'ఓహో! కుంకుమ సమర్పించమంటే అర్థం ఇదా!' అనుకున్నాను. దీనిని దృఢపరుస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర వెంటనే ఒక ఉత్సవం వస్తే, అక్కడివారు నన్నే పిలిచి పూజ్యశ్రీ మాస్టరుగారికి నుదుట కుంకుమ దిద్దమన్నారు. దీనితో పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినది దీని గురించేనని అర్థమైంది. అప్పటినుంచి ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలకు గాని, నుదుటికి గాని కుంకుమ పెట్టే సేవ చేసుకుంటూవుంటాను.

ఒంగోలు బాబా మందిరంలో శ్రీరామనవమికి గంధం, ఉరుసు ఉత్సవాలు చేస్తారు. నాకు ఒకసారి ఉరుసు ఉత్సవంలో గంధం తీసుకుని పోతున్నట్లు స్వప్నం వచ్చింది. అది కూడా ఎప్పుడో జరగబోతుందని అనిపించింది. ఒకసారి మా మూడు సంవత్సరాల పాపను తీసుకుని మందిరానికి వచ్చాను. నేను చావడి దగ్గర కూర్చున్నాను. పాప అక్కడే ఆడుకుంటోంది. నాకు కొంచెం దగ్గరగా కూర్చుని గుడి కమిటీవారు జరగబోయే శ్రీరామనవమి ఉత్సవం గురించి మాట్లాడుకుంటున్నారు. మా పాప పక్కకి వెళుతుంటే ఉర్దూలో ఇటు రమ్మని పిలిచాను. వాళ్ళు అది విని, "నువ్వు ముస్లింవా?" అని ఎంతో సంతోషంగా అడిగారు. నేనిన్నాళ్ళు వస్తున్నా చాలామందికి నేను ముస్లిం అని తెలియదు. ఔనని చెప్పగానే, "ఈసారి ఉత్సవానికి గంధం తెచ్చేవారు ఏదో ఇబ్బంది వచ్చి రాలేకపోతున్నారు. కొంతమంది తెలిసినవారికి ఫోన్ చేస్తే అందడం లేదు, ఈసారి ఆ సేవ నువ్వు చేసుకుంటావా?" అని అడిగారు! ఇదివరకు నాకు స్వప్నంలో చూపించింది నిజమౌతోందని సంతోషించి 'తప్పకుండా చేస్తాన'ని చెప్పాను. ఆవిధంగా గంధం సేవ లభించింది. మధ్యలో ఇతరులు ఆ సేవ చేసినా ఐదారు సంవత్సరాలనుంచి నాకే ఆ సేవ చేసుకునే భాగ్యం కలిగింది.

ఈవిధంగా సేవ చేసుకోవడానికి అవకాశాలు కలగచేస్తూ కులమతాలకు అతీతంగా విరాజిల్లుతున్న పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి బృందావనం నా పాలిటి నందనవనం. అనేక సమస్యలతో వచ్చిన నేను, ఆ వనంలో సేదతీరుతూ హాయిగా వున్నాను. చిన్నతనంలోనే తల్లి తండ్రులను కోల్పోయిన నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఉద్యోగం, వివాహం, సంతానం– అన్నీ అనుగ్రహించారు. ముఖ్యంగా నాస్తికుడిని కావలసిన నన్ను వారి పాదాల చెంతకు చేర్చుకున్నారు. నాకు ఎప్పుడూ శ్రద్ధగా వారి సేవచేసుకునే భాగ్యాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ శతసహస్రకోటి కృతజ్ఞతాపూర్వక పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

ఓం సర్వమత సమన్వయరూపాయ శ్రీ భరద్వాజ సద్గురవే నమః!

జై సాయి మాస్టర్!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు


**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550

Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*


### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |





అక్టోబరు 2వ తేదీ, గురువారంనాడు శ్రీ సాయిబాబా మహాసమాధి చెందిన విజయదశమి పర్వదినాన్ని శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము, గుమ్మళంపాడులో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు అనేక రకముల మందార పువ్వులతో పూజ చేశారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి జన్మదినోత్సవము
అక్టోబరు 01, 2025